ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -181 | పేజీలు - 8 | వెల - 03/- | శనివారం 10 అక్టోబర్ 2026

స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్..



వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు నో..

ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులోనూ అడ్డంకులు!

హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం

ఏపీలో స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్.. వైసీపీ పిటిషన్ కొట్టివేత

ఏపీలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్

ఎస్ఐఆర్ పూర్తయ్యే వరకు వేచి ఉండాలన్న వాదనకు అంగీకరించని కోర్టు


పాత లేదా తాజా ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టీకరణ



న్యూఢిల్లీ/అమరావతి అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటర్ల జాబితా, వార్డుల పునర్విభజన అంశాలపై కీలక స్పష్టత ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠకు తెరపడినట్లయింది.ఓటర్ల జాబితాపై విచారణ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదన్న వైసీపీ వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. ఎస్ఐఆర్ తాజా జాబితా సిద్ధమైనా, పాత ఓటర్ల జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన అంశంపైనా ధర్మాసనం కీలక మిగతాది 2లో...

భద్రతా వలయంలో ఢిల్లీ!



సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల భారీ నిరసనలకు పిలుపు

ఢిల్లీలో 20 వేల మంది బలగాలతో కఠిన భద్రతా ఏర్పాట్లు

57 మెట్రో స్టేషన్ల మూసివేయాలన్న పోలీసులు.. పలు రైళ్ల సర్వీసులు రద్దు

జంతర్ మంతర్ వద్ద నిరసనకు పోలీసుల అనుమతి నిరాకరణ

పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్షలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన భారీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 20,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించి, దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది.పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మిగతాది 2లో...

నవీ పిళ్లేకు నోబెల్ శాంతి పురస్కారం..

అంతర్జాతీయ న్యాయం కోసం అలుపెరుగని పోరాటం

భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిళ్లే

యుద్ధ నేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై పోరాటానికి గుర్తింపు

రువాండా, అంతర్జాతీయ న్యాయస్థానాల్లో న్యాయమూర్తిగా కీలక పాత్ర



కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా

బీసీలకు 34% ఇస్తాం

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చంద్రబాబు ప్రకటన

ప్రతి రైతు సమస్య పరిష్కారమే మా లక్ష్యం

రాజముద్రతో 40 లక్షల పాస్‌పుస్తకాలిచ్చాం

ప్రకాశం జిల్లా సభలో సీఎం చంద్రబాబు



ఒంగోలు, అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.

: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం కన్నా అధికంగానే సీట్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వారందరినీ గెలిపించుకుని తీరుతామని ఉద్ఘాటించారు. గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లి అడ్డుకున్నా సరే బీసీల ప్రాతినిధ్యం పెంచేందుకు మిగతాది 2లో...



అధికార పార్టీల హవా

బెంగాల్ ఉప ఎన్నికల్లో 2 సీట్లలో బీజేపీ జయభేరి

తమిళనాడులో 2 సీట్లు ఖాతాలో వేసుకున్న టీవీకే

అసోంలోని నగావ్ లోక్‌సభ స్థానం బీజేపీదే

పుదుచ్చేరి అసెంబ్లీలో ఏకైక స్థానాన్ని ఏఐఎన్ఆర్‌సీ కైవసం

బీజేపీ గెలుపుపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం

న్యూఢిల్లీ/ చెన్నై, అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.

: మూడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఐదు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికి ఈ నెల 6న జరిగిన ఉప ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లోని అధికార పార్టీలే జయభేరి మోగించాయి. బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజినగర్.. తమిళనాడులోని మధురాంతకం, ధారాపురం.. పుదుచ్చేరిలోని తట్టంచావడి అసెంబ్లీ స్థానాలతోపాటు అస్సాంలోని నగావ్ లోక్‌సభ స్థానానికి మిగతాది 2లో...

పోలవరం ఎమ్మెల్యేపై పవన్ సీరియస్

అవినీతి, ఒంటెత్తు పోకడలపై విచారణ




అమరావతి/ఏలూరు, అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.

ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వ్యవహారశైలిపై ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేపై వస్తున్న అవినీతి ఆరోపణలు, క్యాడర్‌ను విస్మరించడం, కుటుంబ వివాదాలు మిగతాది 2లో...

ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి

రాష్ట్రపతి ముర్ముకు ఇండియా కూటమి నేతల వినతి



ఓట్ల చోరీ జరిగిందనటానికి పూర్తి ఆధారాలున్నాయి

గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికల్ని రద్దు చేయాలి!

ఇకపై ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలి

ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి, జ్ఞానేశ్‌ను తొలగించాలి

న్యూఢిల్లీ, అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో వరుసగా మూడు రోజులు ఢిల్లీలో ఉద్యమించిన ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని, దానిని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. జ్ఞానేశ్‌కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని, ఈవీఎంలను పక్కనపెట్టి ఇకపై బ్యాలెట్ మిగతాది 2లో...



ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి

రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ

హైదరాబాద్ అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.

కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని మిగతాది 2లో...

పూల పండుగకు వేళాయే...

పూల పండుగకు పుట్టింటికి ఆడపడుచులు

దేవీ నవరాత్రులతో భక్తి పారవశ్యం

18న సద్దుల బతుకమ్మ.. 20న విజయదశమి



హైదరాబాద్ అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.

పల్లెలు పండుగ శోభను సంత రించుకోనున్నాయి. ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ.. భక్తిశ్రద్ధలతో కొలిచే దేవీ శరన్నవరాత్రులు.. విజయదశమి వేడుకలు.. ఇలా పండుగల సందడి మొదలుకానుంది. పట్టణాలు, గ్రామాల్లో ఇప్పటికే పండుగ ఏర్పాట్లు ఊపందుకున్నాయి. దేవాలయాలు, ప్రధాన కూడళ్లు, బతుకమ్మ ఆడే ప్రదేశాలు ముస్తాబవుతున్నాయి. బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఆడపడుచులు పుట్టింటికి తరలివస్తారు. మిగతాది 2లో...

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888



భద్రతా వలయంలో ఢిల్లీ!

(మొదటి పేజీ తరువాయి

తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ఈరోజు జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు.

భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే పలు రైళ్లను ఈరోజు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్+ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు.

ఇదిలా ఉండగా, ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పుర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

అధికార పార్టీల హవా

(మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన ఉప ఎన్నికల ఫలితాలను శుక్రవారం వెల్లడించారు. నందిగ్రామ్‌లో బీజేపీ అభ్యర్థి హసిరాణి రథ్ తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌ను రికార్డు స్థాయిలో 1,22,753 ఓట్ల తేడాతో ఓడించారు. హసిరాణికి 1,64,427 ఓట్లు పోలవగా, మిలన్ ప్రధాన్‌కు 41,674 ఓట్లు మాత్రమే వచ్చాయి. ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్న రెజీనగర్‌లో కూడా బీజేపీ జయకేతనం ఎగురవేసింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి శంకర సర్కార్ తన సమీప ప్రత్యర్థి, ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ(ఏజేయూపీ) అభ్యర్థి గొలామ్‌నబీ ఆజాద్‌పై 75,816 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇక్కడ దాదాపు 60 శాతం ముస్లిం ఓటర్లే ఉంటారు. అస్సాంలోని నగావ్ లోక్‌సభ స్థానంలో అధికార బీజేపీ అభ్యర్థి దేబాశిష్ శర్మ తన సమీప ప్రత్యర్థి, ఏఐయూడీఎఫ్ అధినేత బద్రుద్దీన్ అజ్మల్‌ను 1,42,224 ఓట్ల తేడాతో ఓడించారు. గెలుపొందిన బీజేపీ అభ్యర్థులను ప్రధానిమోదీ అభినందించారు. ముస్లిం ఓటర్లు బీజేపీని ఆదరిస్తున్నారనటానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు.తమిళనాడులోని మధురాంతకం (ఎస్సీ) అసెంబ్లీ స్థానంలో అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే) అభ్యర్థి మరగతం కుమారవేల్ తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌ను 20,040 ఓట్ల తేడాతో ఓడించారు. ధారాపురం (ఎస్సీ)లో టీవీకే అభ్యర్థి సత్యభామ.. డీఎంకే అభ్యర్థి సుగన్యను 9,471 ఓట్ల తేడాతో ఓడించారు. ఈ గెలుపుతో తమిళనాడు అసెంబ్లీలో టీవీకే బలం 109 సీట్లకు పెరిగింది. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీలో మెజారిటీ మార్కు 118 కాగా, ఏప్రిల్– మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 సీట్లు గెలిచింది. రెండుసీట్లలో గెలిచిన సీఎం విజయ్ తిరుచిరాపల్లి ఈస్ట్ స్థానాన్ని వదులుకోవటంతో ఆ పార్టీ బలం 107కు తగ్గింది. తాజాగా 109కి పెరిగింది. పుదుచ్చేరిలోని తట్టన్‌చావడి స్థానంలో అధికార ఏఐఎన్ఆర్‌సీ పార్టీ అభ్యర్థి అశోక్ ఆనంద్ కాంగ్రెస్ అభ్యర్థి ఈ వినాయగమ్‌ను 8,400 ఓట్ల తేడాతో ఓడించారు.

పోలవరం ఎమ్మెల్యేపై పవన్ సీరియస్

(మొదటి పేజీ తరువాయి

రచ్చకెక్కడం తదితర అంశాలను తీవ్రంగా పరిగణించారు. ఈ వివాదాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపేందుకు శుక్రవారం ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా బాలరాజుపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, నియోజకవర్గంలో పార్టీ విజయానికి కష్టపడిన నాయకులు, క్యాడర్‌ను విస్మరించి ఎమ్మెల్యే బాలరాజు ఒంటెత్తు పోకడలకు పోతున్నారనే విమర్శలున్నాయి. కొత్తగా వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టడంతో పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి పెరిగింది.

దీంతో పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇక, పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద గిరిజనేతరులకు ప్రభుత్వం కేటాయించే భూముల్లో ఎమ్మెల్యే అనుచరులు భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. లబ్ధిదారుల నుంచి ముందుగానే ఖాళీ చెక్కులు, ఒప్పంద పత్రాలు రాయించుకున్నట్లు విమర్శలున్నాయి. బెల్టు షాపు నిర్వహించే వ్యక్తుల నుంచి రూ.లక్షల్లోనే వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే తన ఇంటికి సమీపంలో ఒక ప్రైవేట్ పాఠశాలను ఏర్పాటు చేసి, జంగారెడ్డిగూడెంలోని ఓ కార్పొరేట్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారని సమాచారం.

పూల పండుగకు వేళాయే...

(మొదటి పేజీ తరువాయి

కుటుంబ సభ్యులు, తోబుట్టువులు, బంధువులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారు. దీంతో దూర ప్రాంతాల్లో ఉన్న ఆడపడుచుల రాకతో గ్రామాలు, పట్టణాల్లో సందడి నెలకొంటుంది.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను పేర్చి, సాయంత్రం మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు చేసుకుంటారు. ప్రకృతి, నీరు, మట్టి, పూలతో ప్రజలకు ఉన్న అనుబంధాన్ని ఈ పండుగ ప్రతిబింబిస్తుంది. బతుకమ్మను తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.బతుకమ్మ ఉత్సవాలు శనివారం ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు కొనసాగనున్నాయి. చిన్న బతుకమ్మల నుంచి పెద్ద బతుకమ్మల వరకు రోజుకో ప్రత్యేకతతో వేడుకలు నిర్వహిస్తారు. చివరి రోజైన 18న సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకోనున్నారు.

బతుకమ్మతో పాటు ఆదివారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు, భజనలు, పారాయణాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని పలు ప్రధాన దేవాలయాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లోనూ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.నవరాత్రుల అనంతరం ఈనెల 20 మంగళవారం విజయదశమి జరగనుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరాను నిర్వహించడం ఆనవాయితీ. తెలంగాణలో దసరాకు ప్రత్యేక స్థానం ఉంది. కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లడం, జమ్మి చెట్టును పూజించడం, పెద్దలను కలిసి ఆశీర్వాదాలు తీసుకోవడం, పరస్పరం జమ్మి ఆకులను ఇచ్చిపుచ్చుకోవడం వంటి సంప్రదాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.బతుకమ్మ, దసరా పండుగలు కేవలం ఆచార వ్యవహారాలు మాత్రమే కాదు.. కుటుంబాలను, బంధుత్వాలను కలిపే వేడుకలు. ఉద్యోగాలు, ఉపాధి, వ్యాపారాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లినవారు పండుగ సందర్భంగా స్వగ్రామాలకు చేరుకుంటారు. ముఖ్యంగా బతుకమ్మ సందర్భంగా ఆడపడుచులు పుట్టింటికి రావడంతో గ్రామాల్లో పాత జ్ఞాపకాలు, ఆత్మీయ పలకరింపులు, బంధుత్వాల సందడి కనిపిస్తుంది. గ్రామాలు, పట్టణాల్లో పండుగ ఏర్పాట్లు మొదలయ్యాయి. బతుకమ్మ ఆడే ప్రదేశాలను శుభ్రం చేయడం, ఆలయాలను విద్యుద్దీపా లతో అలంకరించడం, ఉత్సవ కమిటీల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. మార్కెట్లలో పూలకు డిమాండ్ పెరగడంతో పూల వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

(మొదటి పేజీ తరువాయి

ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్..

(మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికిప్పుడు వార్డుల పునర్విభజన చేపట్టాలని కోరడం ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అడ్డంకులు తొలగినట్లయింది

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు నో..

ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నానికి సుప్రీంకోర్టులోనూ అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి న్యాయపరమైన అడ్డంకులు కొనసాగుతున్నాయి. గతంలో ఇదే అంశంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ప్రస్తుతానికి అడ్డంకి ఏర్పడింది. ఈ రిజర్వేషన్లను అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతాయని హైకోర్టు గతంలో పేర్కొంది. ఆ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది.

వెనకబడిన తరగతులకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్న ఉద్దేశంతో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 20న గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించి జీవో 105 జారీ చేసింది. పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆగస్టు 19న మరో ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిర్ణయాలపై న్యాయస్థానాల్లో సవాళ్లు ఎదురయ్యాయి. 2020లోనూ 34 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది.రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం.. స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి రిజర్వేషన్లు సాధారణంగా 50 శాతం మించకూడదు. అంతకంటే ఎక్కువ రిజర్వేషన్లు కల్పించాలంటే వెనుకబాటుతనంపై సమగ్ర అధ్యయనం, విశ్వసనీయ గణాంకాలు అవసరమని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టు తాజా నిర్ణయం రాష్ట్రంలో రాజకీయంగా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

నవీ పిళ్లేకు నోబెల్ శాంతి పురస్కారం..

భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిళ్లే

న్యూఢిల్లీ, అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.

అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్లేను 2026 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలన వంటి తీవ్రమైన అంశాలపై నేరస్థులను చట్టం ముందు నిలబెట్టేందుకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ఈ ప్రకటన చేసింది. అసాధారణమైన ధైర్యం, నైతిక నిబద్ధతతో ప్రపంచ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను కమిటీ కొనియాడింది.దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో మగ్గుతున్న ఒక భారత తమిళ మూలాలు ఉన్న కుటుంబంలో నవీ పిళ్లే జన్మించారు. సమాజంలో పాతుకుపోయిన తీవ్రమైన వివక్ష, వేర్పాటువాదాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన నెల్సన్ మండేలా వంటి ఎందరో ఉద్యమకారులకు ఆమె న్యాయవాదిగా అండగా నిలిచారు. తన సుదీర్ఘ కెరీర్‌లో



ఆమె దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా, రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్ , అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు న్యాయమూర్తిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గానూ సేవలందించారు. ఇటీవల వరకు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై యూఎన్ ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఆమె మయన్మార్‌పై నమోదైన జాతి నిర్మూలన కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం లో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. రువాండా ట్రైబ్యునల్‌లో నవీ పిళ్లే పాత్ర చరిత్రాత్మకమైనది. అత్యాచారం, లైంగిక హింసను కేవలం సాధారణ నేరాలుగా కాకుండా, మానవత్వానికి వ్యతిరేక నేరాలుగా, జాతి నిర్మూలన చర్యగా పరిగణించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. కేవలం విద్వేషపూరిత ప్రచారం ద్వారా జాతి నిర్మూలనకు ప్రేరేపించారన్న ఆరోపణలపై ఒక నిందితుడిపై విచారణ జరగడంలోనూ ఆమె ప్రభావం ఉంది. ఇది అంతర్జాతీయ న్యాయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయని, అంతర్జాతీయ చట్టబద్ధ పాలన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని నోబెల్ కమిటీ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. అధికార రాజకీయాల ప్రాబల్యం పెరిగి, న్యాయ వ్యవస్థలు బలహీనపడుతున్నాయని పేర్కొంది. ఇలాంటి క్లిష్ట సమయంలో, శాంతికి న్యాయమే పునాది అని, అరాచకం, అధికార దర్పం మధ్య న్యాయాన్ని కాపాడే న్యాయమూర్తుల పాత్ర అత్యంత కీలకమని నొక్కి చెప్పింది. నవీ పిళ్లే వంటి ధైర్యవంతులు దేశాలను, నాయకులను జవాబుదారీగా నిలబెడుతూ, హింస బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని ప్రశంసించింది. ఆమె నిబద్ధత, స్వాతంత్ర్యం, అపారమైన అనుభవం ఆమెను మన కాలంలోని అత్యంత గౌరవనీయమైన అంతర్జాతీయ న్యాయవేత్తలలో ఒకరిగా నిలబెట్టాయని కమిటీ పేర్కొంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా దేశాల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో ఆమె చేసిన కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడింది.

కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా బీసీలకు 34% ఇస్తాం

(మొదటి పేజీ తరువాయి

టీడీపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామంలో మీభూమి-మీహక్కు కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన రైతులు, మహిళలు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తాజా తీర్పుపై సభలో చంద్రబాబు స్పందించారు. సామాజికంగా, ఆర్థికంగా బీసీలను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీనే అన్నారు. ఎన్టీఆర్ పాలనలో బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు ఇస్తే, తాను వచ్చాక 34 శాతం చేశానని, గత వైసీపీ ప్రభుత్వం దానిని 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. వైసీపీ నిర్వాకంతో 16,800 పదవులు బీసీలు కోల్పోయారన్నారు. తిరిగి కూటమి వచ్చాక 34 శాతం రిజర్వేషన్లను నిర్ణయిస్తే, దానిని వ్యతిరేకిస్తూ గొడ్డలి పార్టీ వాళ్లు కోర్టుకు వెళ్లారని అన్నారు. తొలి నుంచి గొడ్డలి పార్టీకి బీసీలంటే వ్యతిరేకత, చిన్నచూపే ఉందని విమర్శించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు 34 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చాయని, అయితే అంతకన్నా అధికంగానే పార్టీ పరంగా బీసీలకు సీట్లుఇచ్చి గెలిపిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికలంటే గొడ్డలి పార్టీకి వెన్నులో వణుకు పుడుతోందని, ఎన్నికల్లో ఓటమి చెందాక గ్రామాల్లో వారి కార్యకర్తలు బయటకురారని భయపడుతూ ఎలాగోలా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 'సర్'ను ఒకవైపు వ్యతిరేకిస్తూ మరోవైపు అది పూర్తయ్యాక ఎన్నికలు పెట్టాలని కోర్టుకు వెళ్లి రెండు నాల్కల ధోరణి ప్రదర్శించారని చంద్రబాబు విమర్శించారు.

స్థానిక ఎన్నికల్లోనూ ఆశీర్వదించండి:

నీటి సౌకర్యంతో అభివృద్ధి సాధ్యమన్న చంద్రబాబు.. పట్టిసీమతో కృష్ణా డెల్టాకు గోదావరి నీరు తీసుకురావడం వల్ల శ్రీశైలం నుంచి వెలిగొండకు నీరివ్వగలిగామని వివరించారు. గోదావరి-కావేరి అనుసంధానర చేస్తే ఐదు రాష్ట్రాలు, ఐదు జీవనదులు అనుసంధానమై అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ప్రధాని మోదీతోనూ ఈ విషయంపై చర్చించానని చెప్పారు. వెలిగొండ రెండోదశను కూడా రెండేళ్లలో పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, సంపద వృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న మంచి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. 'మంచి పని చేసేవారిని గుర్తిస్తే మంచి జరుగుతుంది. ఓసారి గత వైసీపీ పాలనను గుర్తుచేసుకోండి. అప్పట్లో ఎవరి మొహంలో నవ్వు అన్నది లేదు. ఇంట్లో, బయట కూడా భద్రత లేదు. ఎటుచూసిన విధ్వంసమే సాగింది. అలాంటి పరిస్థితి మళ్లీ రాష్ట్రానికి రాకూడదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి అపూర్వ విజయం అందించినట్లు స్థానిక ఎన్నికల్లోనూ ప్రజలు ఆశీర్వదించండి' అని కోరారు.

పాలం వెళ్లాలే కానీ ఆఫీసుల చుట్టూ కాదు

'గత ప్రభుత్వ హయాంలో ఎటుచూసినా భూవివాదాలు, ఆక్రమణలు, దందాలు సాగాయి. రీసర్వే పేరుతో అస్తవ్యస్తం చేశారు. రైతుల భూములపై నాయకుడి ఫొటో వేసుకొని పాసుపుస్తకాలు ఇచ్చారు. పొలంలో సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకొని రైతులకు అభద్రత కలిగేలా చేశారు. గిట్టనివారివి, తమకు డబ్బులివ్వనివారికి చెందిన భూములను 22(ఏ)లో పెట్టించి వేధించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటన్నింటిని గుర్తించి ప్రతి రైతు సమస్యనూ పరిష్కారం చేయడమే లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నాం. రైతు హలం పట్టి పొలం వెళ్లాలే కానీ అర్జీ పట్టుకొని ఆఫీసులు చుట్టూ తిరిగే అవసరం రాకూడదు. అందుకోసం భూముల సర్వేలో జరిగిన అవకతవకలు, తప్పిదాలు సరిచేస్తూ రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను మీభూమి- మీహక్కు కార్యక్రమంలో ఇస్తున్నాం. ఇప్పటి వరకు 40.58 లక్షల పాసుపుస్తకాలు ఇచ్చాం. మార్చి ఆఖరులోపు మరో 51.91 లక్షలు ఇవ్వనున్నాం. నవంబరులో 10.95 లక్షలు, డిసెంబరులో 9.90 లక్షలు, జనవరిలో 9.0 లక్షలు, ఫిబ్రవరిలో 7.70 లక్షలు, మార్చిలో 12.30లక్షల పాసుపుస్తకాలు ఇస్తాం. ఎవరూ ట్యాంపరింగ్ చేయకుండా ఉండే సాంకేతికత, క్యూఆర్ కోడ్‌లతో రాజముద్రతో ఇస్తున్నాం' అని అన్నారు.

ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి

(మొదటి పేజీ తరువాయి

పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంటూ ఒక విజ్ఞాపనపత్రం అందజేశారు. ఇండియా కూటమి ఎంపీలు దేశంలోని 60 శాతం జనాభాకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రపతిని కలవటానికి ముందు ఇండియా కూటమి ఎంపీలు 'ప్రజాస్వామ్యాన్ని రక్షించండి' అని రాసి ఉన్న భారీ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ పార్లమెంటు హౌస్ నుంచి విజయ్‌చౌక్ వరకూ ర్యాలీ జరిపారు. విజయ్‌చౌక్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం, రాష్ట్రపతి భవన్ నుంచి పిలుపు రావటంతో ఇండియా కూటమి నేతల బృందం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లింది. ఈ బృందంలో రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే(కాంగ్రెస్), మమతా బెనర్జీ (తృణమూల్), ఒమర్ అబ్దుల్లా (ఎన్సీ), సుప్రియాసూలే (ఎన్సీపీ-పవార్), రాజీవ్‌రాయ్ (ఎస్పీ), మనోజ్‌ఝా (ఆర్జేడీ), తిరుమావలన్ (వీసీకే), డీ రాజా (సీపీఐ), ఏంఏ బేబీ (సీపీఎం) ఉన్నారు. రాష్ట్రపతిని కలిసి విజ్ఞాపనపత్రం అందజేసిన అనంతరం తిరిగి వచ్చి మీడియాతో నేతలు మాట్లాడారు.

మోదీ, అమిత్‌షా, జ్ఞానేశ్‌కుమార్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే కుట్ర పన్నారని రాష్ట్రపతికి తెలియజేశామని రాహుల్ పేర్కొన్నారు. 'మేం చెప్పినదాన్ని రాష్ట్రపతి ఎంతమాత్రం నిరాకరించలేదు. ప్రశ్నించలేదు కూడా. మా ఆరోపణలకు ఆధారాలు ఉంటే ఇవ్వమని అడిగారు' అని రాహుల్ తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను సోమవారం కలిసి విజ్ఞాపనపత్రం అందజేస్తామని వెల్లడించారు. ఖర్గే మాట్లాడుతూ, రాష్ట్రపతి అడిగిన ఆధారాల్ని తాము సమర్పిస్తామన్నారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్ని ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలన్నారు.

13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలి

ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతికి సమర్పించిన విజ్ఞాపనపత్రంలో పలు కీలక డిమాండ్లు చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తప్పించాలి, సీఈసీకి, ఎన్నికల మిషనర్లకు న్యాయవిచారణ నుంచి రక్షణ కల్పిస్తున్న 2023 నాటి చట్టాన్ని రద్దు చేయాలి, ఇకపై దేశంలో జరిగే అన్ని ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలి, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలి, ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి ఆ జాబితాలో చేర్చాలి, గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీల ఎన్నికల్ని రద్దు చేయాలి.. వీటిలో ఓట్ల చోరీ జరిగినట్లుగా స్పష్టమైన ఆధారాలున్నాయని పేర్కొన్నారు. కోట్లాది మంది భారతీయులకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన ఓటు హక్కును హరించటానికి యావత్ ఎన్నికల వ్యవస్థను, ప్రజాస్వామ్య వ్యవస్థలను మోదీ, అమిత్‌షా చెరబట్టారని ఆరోపించారు. 'హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికను బీజేపీ దొంగిలించిందని, భారీ ఎత్తున ఓట్లచోరీ జరిగిందనటానికి తమ వద్ద తిరుగులేని ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ ఈవీఎంలను, ఓటర్ల జాబితాలను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఈ సంక్షోభ సమయంలో భారత రిపబ్లిక్ రాజ్యాంగ అధినేతగా తగిన చర్యలు తీసుకోవాలని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు..

ఉద్యమిస్తే ప్రభుత్వ పతనం ఖాయం: రాహుల్

రాష్ట్రపతిని కలవటానికి ముందు ఇండియా కూటమి ఎంపీలు సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. దేశంలో జ్ఞానేశ్‌కుమార్‌ను మించిన సమస్య ఉందని, దానిని పరిష్కరించాలంటే ప్రస్తుత ప్రభుత్వాన్నే తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. గత 3-4 రోజులుగా ఉద్యమిస్తున్న విధంగానే విపక్షాలు ముందుకు దూసుకెళ్తే మోదీ ప్రభుత్వం కుప్పకూలటం ఖాయమని చెప్పారు. విపక్షాల ఉద్యమంతో ప్రభుత్వ పతనం ఖాయమని చెప్పారు. ఇదిలా ఉండగా, దేశంలో ప్రతి వ్యాపారానికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని రాహుల్ అన్నారు. క్రోనీ క్యాపిటలిజం(ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం) గొలుసును తెంచుతామని, వ్యాపారులందరికీ సమాన అవకాశాలు కల్ప

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

సెలవుల్లో అనధికారికంగా తరగతి గదులు నిర్వహిస్తే అడ్డుకుంటాం - ఏబీవీపీ



నంద్యాల, అక్టోబర్ 09(రిపబ్లిక్ న్యూస్)
ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాల్లో ప్రైవేటు విద్యా సంస్థలు అనధికారికంగా తరగతి గదులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నంద్యాల శాఖ విద్యాశాఖ అధికారి జనార్ధన్ గారికి తెలపడం జరిగింది. ఉత్సాహంగా, ఉల్లాసంగా సెలవు దినాల్లో గడపాల్సిన విద్యార్థులను, మానసిక ఒత్తిడికి గురిచేస్తూ, అనధికారికంగా తరగతి గదులు నిర్వహించే పాఠశాలలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. అదేవిధంగా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలను,కళాశాలలను ఏబీవీపీ అడ్డుకుంటుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ సాయి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ విష్ణు, జిల్లా కన్వీనర్ లక్ష్మీనరసింహ పలువురు పాల్గొన్నారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై
టీడీపీ కట్టుబడి ఉంది

చట్టపరంగా సాధ్యం కాకపోయినా.. పార్టీ పరంగా బీసీలకు న్యాయం చేస్తాం

వైసీపీ కోర్టులకు వెళ్లి రిజర్వేషన్లను అడ్డుకుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు విమర్శ

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 9)



బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయడంపై ఆయన తన కార్యాలయంలో స్పందించారు.బీసీలకు రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కోర్టులను ఆశ్రయించి అడ్డుకున్నారని నాగరాజు ఆరోపించారు. ఈ చర్యలతో బీసీ వర్గాలకు తీరని అన్యాయం జరిగిందని విమర్శించారు. బీసీలకు న్యాయం చేయడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని, వారి హక్కులను కాపాడేందుకు పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.చట్టపరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాని పరిస్థితులు ఎదురైనా, పార్టీ పరంగా వారికి తగిన న్యాయం చేస్తామని ఎంపీ నాగరాజు హామీ ఇచ్చారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్న వైసీపీ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు తమకు జరిగిన అన్యాయంపై తగిన విధంగా స్పందిస్తారని ఆయన పేర్కొన్నారు. బీసీల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు టీడీపీ నిరంతరం కృషి చేస్తుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు మరో అవకాశం

రేపు కర్నూలు పోలీసు కేంద్రంలో బాండ్ల పరిశీలన, నమోదు

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 9)



అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన, నమోదు ప్రక్రియను నిర్వహించనున్నట్లు నేర పరిశోధన విభాగం (సీఐడీ) కర్నూలు విభాగం అదనపు పోలీసు సూపరింటెండెంట్ తెలిపారు.
కర్నూలు జిల్లా సి. బెళగల్ మండలం, నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలాలకు చెందిన అగ్రిగోల్డ్ డిపాజిటర్లు, బాధితులు, నామినీలు, చట్టబద్ధ వారసులు, ఏజెంట్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అక్టోబర్ 10వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కర్నూలు జిల్లా పోలీసు కేంద్రంలోని సమాజ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రంలో పత్రాల పరిశీలన, నమోదు చేపట్టనున్నారు.సంబంధిత వ్యక్తులు తమకు వర్తించే ధ్రువీకరణ పత్రాలతో పాటు అసలు బాండ్లు లేదా రసీదులను పరిశీలన కోసం తీసుకురావాలి. వాటితోపాటు సంతకం చేసిన రంగుల నకలు ప్రతులు, ఇతర సంబంధిత పత్రాలను సమర్పించి నమోదు చేయించుకోవాలి.అసలు బాండ్లను అప్పగించాల్సిన అవసరం లేదు. పరిశీలన అనంతరం సమర్పించిన పత్రాల నకలు ప్రతులకు ధ్రువీకరణ రసీదు అందజేస్తారు.సి. బెళగల్, జూపాడు బంగ్లా మండలాలకు చెందిన అగ్రిగోల్డ్ బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత సమయంలో తమ పత్రాల పరిశీలన, నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సీఐడీ కర్నూలు విభాగం అదనపు పోలీసు సూపరింటెండెంట్ కోరారు.

ఎమ్మెల్యే ను కలిసిన మైలేరి మల్లయ్య దంపతులు





ఆళ్లగడ్డ అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను అలాగే టీడీపీ యువ నాయకులు భూమా జగత్ విక్యాత్ రెడ్డిని,టీడీపీ సీనియర్ నాయకులు భార్గవ్ రామ్ ని ఆళ్లగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య, మార్కెట్ చైర్ పర్సన్ మైలేరి సురేఖ మర్యాద పూర్వకంగా కలిసి మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సద్గురు దత్త కృపాలయం సేవలు అభినందనీయం

పేదలకు, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

మూడు వైకుంఠ రథాలు, నాలుగు ఫ్రీజర్ బాక్సులను ప్రారంభించిన మంత్రి టీజీ భరత్

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 9)





సమాజ సేవలో సద్గురు దత్త కృపాలయం ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. పేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న సద్గురు దత్త కృపాలయంలో మూడు వైకుంఠ రథాలు, నాలుగు ఫ్రీజర్ బాక్సులను మంత్రి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కరోనా సమయంలో సద్గురు దత్త కృపాలయం ట్రస్ట్ అందించిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే వారికి ప్రతిరోజూ సుమారు వెయ్యి మందికి ఉచితంగా భోజనం అందిస్తూ ట్రస్ట్ మానవత్వాన్ని చాటుకుంటోందని కొనియాడారు. నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం స్ఫూర్తిదాయకమన్నారు.
ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఇతరులకు ఉపయోగపడే మంచి పనులు చేయాలని, తమకు చేతనైనంత సహాయం అందించాలని సూచించారు. సమాజంలో పరస్పర సహకారం, మానవత్వం పెంపొందినప్పుడే సేవాభావానికి నిజమైన అర్థం ఉంటుందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని తెలిపారు. సద్గురు దత్త కృపాలయం ట్రస్ట్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ రెడ్డి స్వామి చేస్తున్న సేవలను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని అన్నారు. వైకుంఠ క్షేత్ర అభివృద్ధికి తనవంతుగా, రాష్ట్ర ప్రభుత్వ పరంగా అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. ట్రస్ట్ కమిటీ సభ్యులు భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.

ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

ఈ కార్యక్రమంలో డీవీఆర్ కమ్యూనికేషన్స్ అధినేత డి. వెంకటేశ్వర్ రెడ్డి తరఫున రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.కె. మహేష్ అందించిన చెక్కును మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా సద్గురు దత్త కృపాలయం కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సద్గురు దత్త కృపాలయం వ్యవస్థాపకులు చంద్రశేఖర్ రెడ్డి, మాతృశ్రీ కృష్ణకుమారి, అధ్యక్షుడు మల్లారెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ జగదీష్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, ట్రస్ట్ కార్యదర్శి శ్రీధర్ గుప్తా, అదనపు కార్యదర్శి హరినాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాకేష్, నిర్మల రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శేషు యాదవ్, సుజాత, సిటీ కేబుల్‌కు చెందిన ఎస్.కె. మహేష్ తదితరులు పాల్గొన్నారు

అనంత డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు.



ఆళ్లగడ్డ అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్ ఆళ్ళగడ్డ పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ అనంతరామ సుబ్బా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు సరియైన ప్రణాళిక, ఆత్మవిశ్వాసంతో ఎన్నో విజయాలు సాధించవచ్చని సూచించారు. అలాగే సెప్టెంబర్ నెలలో అనంతపురం జిల్లా బ్రాహ్మణపల్లె లో 28(A) బెటాలియన్ వారిచే నిర్వహించిన ఎన్.సి.సి. క్యాంపు లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అయన అందజేశారు. కళాశాలలో నిర్వహించే వివిధ క్రీడలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చదువుతో పాటు క్రీడలలో ఉన్నత ప్రతిభ కనబరచాలని, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అనంత విజయ లక్ష్మీ, డిగ్రీ ప్రిన్సిపాల్ కొల్లం నరసింహ జూనియర్ ప్రిన్సిపాల్ శంకరాచారి మరియు అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితం ఆదర్శప్రాయం

ఫాతిమా షేక్, కాన్షీరామ్‌లకు మహిళా ఐక్య వేదిక ఘన నివాళి



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 9)
సామాజిక సంస్కరణల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయులు ఫాతిమా షేక్, మాన్యశ్రీ కాన్షీరామ్‌ల జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు.
ఫాతిమా షేక్ వర్ధంతి, మాన్యశ్రీ కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా మహిళా ఐక్య వేదిక జిల్లా అధ్యక్షురాలు వగ్గ ఈరమ్మ ఆధ్వర్యంలో కర్నూలులోని వేదిక జిల్లా ప్రధాన కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కర్నూలులోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలేతో కలిసి దళిత బాలికలు, మహిళలకు విద్యను అందించడంలో ఫాతిమా షేక్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. మహిళా విద్యాభివృద్ధికి, సామాజిక సమానత్వానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.
రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి మాట్లాడుతూ, “కులాన్ని నిర్మూలిద్దాం.. బహుజన సమాజాన్ని నిర్మిద్దాం” అనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని నడిపిన పోరాట యోధుడు మాన్యశ్రీ కాన్షీరామ్ అని కొనియాడారు. బహుజనుల హక్కుల సాధనకు, రాజ్యాధికారంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లిన కాన్షీరామ్, బహుజన సమాజానికి రాజకీయ చైతన్యం కల్పించారని తెలిపారు. దళితులు, మహిళలు, బహుజనులపై దాడులు, అత్యాచారాలు, కుల వివక్ష అంతం కావాలంటే రాజకీయ అధికారంలో భాగస్వామ్యం సాధించాలని ఆయన పిలుపునిచ్చారని పేర్కొన్నారు. బహుజన రాజ్యాధికార సాధన కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.



ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ సీఎస్‌కే ప్రకాష్, బీసీ నాయకులు శేషఫణి, రమేష్ యాదవ్, ఆదోని డివిజన్ అధ్యక్షురాలు ఎలీశమ్మ, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షురాలు హుస్సేన్ బీ, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు ఆకుతోట పద్మావతి, రంగమ్మ, అమీనా, కళావతి, మాసుంబీ తదితరులు పాల్గొన్నారు

తుపల్లె గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి పది కుటుంబాల చేరిక





ఆళ్లగడ్డ అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు, కుటుంబ సభ్యులుఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం తుపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన పది కుటుంబాలు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఇమామ్ కాసిం, హుస్సేన్ షా, సాలు, అరబ్బీ, కొండ కాసిం, భాష, శివ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.ప్రజలతో మమేకమవుతూ, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని అణగదొక్కుతున్న వైఎస్ జగన్

టీడీపీ బీసీ నాయకుల ఆరోపణ.. 34 శాతం రిజర్వేషన్లపై వైసీపీని నిలదీత

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 9)



బీసీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటూ వారి హక్కులను అణగదొక్కేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు ఆరోపించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో వైసీపీ వైఖరి ఏమిటని వారు ప్రశ్నించారు.
కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీసీ నాయకులు మాట్లాడుతూ, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కోర్టుల్లో కేసులు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి వైసీపీకి ఉంటే రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు.
టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలకు రిజర్వేషన్ల విషయంలో చట్టపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ, పార్టీ పరంగా కచ్చితంగా రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించడం బీసీల పట్ల తెలుగుదేశం పార్టీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతి, రాజకీయ ప్రాతినిధ్యం కోసం టీడీపీ కట్టుబడి ఉందని తెలిపారు.
ఈ సమావేశంలో రాష్ట్ర బందుల కార్పొరేషన్ చైర్మన్ డి. విక్రమ్ సింగ్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె. పార్వతమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్, బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, కె. పరమేష్, కార్పొరేషన్ డైరెక్టర్లు సంజీవలక్ష్మి, ఎల్వీ ప్రసాద్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు బిసన్న తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



ఆళ్లగడ్డ అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ తాలూకా దొర్నిపాడు మండలం, క్రిష్టిపాడు గ్రామంలో రూ. 5 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ. అదేవిధంగా గ్రామాభివృద్ధిలో భాగంగా రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేయడం జరిగింది. గ్రామంలో ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడంతో పాటు, మెరుగైన రోడ్లు ఏర్పడటం ఎంతో సంతోషకరమైన విషయం. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు మా కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుంది తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

డోన్ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా దరఖాస్తులు, రికార్డుల పరిశీలన

ఫారం 6, 7, 8 దరఖాస్తుల నిర్వహణపై ఈఆర్ఓలకు రోల్ అబ్జర్వర్ ప్రశాంతి సూచనలు



నంద్యాల బ్యూరో, అక్టోబర్ 09 (రిపబ్లిక్ న్యూస్):ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల పరిశీలన, రికార్డుల నిర్వహణలో నిబంధనలు పక్కాగా పాటించాలని రోల్ అబ్జర్వర్, రిహాబిలిటేషన్, రీసెటిల్మెంట్ డైరెక్టర్ ప్రశాంతి సంబంధిత ఎన్నికల అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె డోన్ నియోజకవర్గంలో పర్యటించి, ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం–6, ఫారం–7, ఫారం–8 ద్వారా అందిన దరఖాస్తులను, వాటికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ, వాటి నిర్వహణ, పరిశీలన ప్రక్రియలో పాటించాల్సిన విధానాలను సమీక్షించారు. రికార్డుల నిర్వహణలో ఉన్న లోటుపాట్లను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు) తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, అవసరమైన ఆధారాలతో రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. డోన్ ఆర్డీఓ నరసింహులు, సంబంధిత ఏఈఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

విదేశీయుల వసతి వివరాలు 24 గంటల లోపు ఆన్లైన్లో నమోదు చెయ్యాలి

ఎఫ్ ఆర్ ఆర్ ఓ, ఎఫ్ ఆర్ ఓ ఆఫీసు కు పంపించాలి

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవుఎ -జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్





నంద్యాల క్రైం, అక్టోబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): జిల్లా పరిధిలో విద్య, వైద్యం, పర్యాటకం, వ్యాపారం లేదా ఇతర అవసరాల నిమిత్తం వచ్చే విదేశీయులకు ఆశ్రయం కల్పించే హోటళ్లు,హాస్టళ్లు, గెస్ట్‌హౌస్‌లు,అద్దె ఇంటి యజమానులు, ఆసుపత్రులు ,ఆస్తుల యజమానులు, విద్యాసంస్థలు తదితరులు తమ వద్దకు వచ్చే విదేశీయుల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో 24 గంటల్లోపు వారి వివరాలను నమోదు చేయాలని జిల్లా ఎస్.పి. సునీల్ షోరాణ్ అక్టోబర్ 10 న ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీయుల రాకపోకల వివరాలను సంబంధిత ఎఫ్.ఆర్.ఆర్.ఓ. ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.నంద్యాల జిల్లాలోని ఎఫ్.ఆర్.ఓ. కార్యాలయం పరిధిలో విదేశీయుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు బి.ఓ.ఐ.వెబ్‌సైట్ ద్వారా ఫారం–సి సమర్పించవచ్చని తెలిపారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన నిబంధనల ప్రకారం, విదేశీయులకు వసతి కల్పించే హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌసులు, హాస్టళ్లు, గృహ యజమానులు, విద్యాసంస్థలు తదితరులు సంబంధిత వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. విదేశీయులు తమ వద్దకు వచ్చిన తేదీ, పాస్‌పోర్ట్, వీసా తదితర వివరాలను సంబంధిత ఫారంలో నమోదు చేసి సమర్పించాలి. అంతేకాకుండా విదేశీయులు అనగా నేపాల్ భూటాన్ పౌరులు కూడా, ఓసిఐ కార్డు కలిగిన (భారతీయులు) వారు కూడా తప్పనిసరిగా బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ పోర్టల్ లోని పోర్టల్ ద్వారా వారు వచ్చిన/బస చేసిన/నిష్క్రమణ పూర్తి వివరాలు, ఎఫ్ ఆర్ ఆర్వో, ఎఫ్ ఆర్ ఓ కు తెలపవలెను. విదేశీయుల వివరాలను నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించినట్లయితే సంబంధిత వ్యక్తులు/సంస్థలపై నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయడము తో పాటు జరిమానా 50,000 నుండి 1,00,000 రూపాయలు వరకు, జైలు శిక్ష రెండు సంవత్సరముల నుండి అయిదు సంవత్సరముల వరకు లేదా రెండు విధించే అవకాశము ఉందని తెలిపారు. విదేశాలలో స్థిరపడిన దేశములో నిర్వహించే ఎటువంటి ఎన్నికలలో పోటీచేయరాదని, ఓటు వేయరాదని వ్యవసాయ భూములు కొనుగోలు చేయరాదని, విదేశీయుల వివరాల నమోదుపై అప్రమత్తంగా ఉండాలని నంద్యాల జిల్లా ఎస్.పి సూచించారు.

ప్రతి మనిషిలో ఒత్తిడి సహజమే..

దాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

వైద్య విద్యార్థులు స్నేహితులు, రోగులతో ఆప్యాయంగా పలకరించడం నేర్చుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 9)

ప్రతి మనిషి జీవితంలో ఒత్తిడి సహజమని, దానిని అసహజంగా భావించకుండా ఆత్మవిశ్వాసంతో అధిగమించి ముందుకు సాగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి లీలా వెంకట శేషాద్రి వైద్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. వైద్య విద్యార్థులు మంచి పలకరింపును అలవర్చుకోవాలని, స్నేహితులు, రోగులతో ఆప్యాయంగా మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు మెడికల్ కళాశాలలోని నూతన ఉపన్యాస మందిరంలో మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక వైద్య విభాగాధిపతి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి లీలా వెంకట శేషాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

జీవితంలో ఒత్తిడి ఎదురుకావడం సహజమని, దానిని తట్టుకుని ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె సూచించారు. న్యాయస్థానాల్లోనూ న్యాయమూర్తులు ఒత్తిడిని ఎదుర్కొంటారని, వాదప్రతివాదుల వాదనలు విని వాస్తవాలను పరిశీలించి న్యాయం చేయడం ఎంతో బాధ్యతతో కూడుకున్న పని అని వివరించారు. వైద్య విద్యార్థులకు అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు సహాయం కోసం 15100 నంబరుకు ఫోన్ చేయవచ్చని,



బాధితులకు అవసరమైన సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉంటామని తెలిపారు.

శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యం కళాశాల అదనపు డీఎంఈ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు ఆత్మపరిశీలన చేసుకుని, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించడం ముఖ్యమన్నారు. శరీరంలో విటమిన్ బి12, విటమిన్ డి స్థాయిలు తగినంతగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

వైద్య విద్య విద్యార్థులకు విజ్ఞానంతో పాటు ఉన్నతమైన జీవితాన్ని, సమాజంలో గౌరవప్రదమైన గుర్తింపును అందిస్తుందని పేర్కొన్నారు. అలాంటి విలువైన విద్యను ఇష్టపడి అభ్యసించాలని, చదువులో ఎదురయ్యే కష్టాలను తట్టుకోలేక జీవితాన్ని ముగించుకోవాలనే ఆలోచనలకు లోనుకాకూడదని హితవు పలికారు.

ఓటమిని విజయానికి మెట్టుగా మలుచుకోవాలి

కళాశాల అదనపు డీఎంఈ, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఇష్టంతో





చదువుకుని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పరీక్షల్లో విఫలమైనంత మాత్రాన నిరాశ చెందకూడదని, ఆ అనుభవాన్ని తదుపరి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మెట్టుగా ఉపయోగించుకోవాలని తెలిపారు. గెలుపోటములు జీవితంలో సహజమని, అపజయాలను అధిగమిస్తూ లక్ష్యం వైపు సాగాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో మనోన్యాయ లీగల్ సర్వీసెస్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రొఫెసర్ మాధవి శ్యామల, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రూపస్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గంగాధర్ నాయక్, డాక్టర్ యతిరాజు, సైకాలజిస్ట్ చంద్రశేఖర్, పీజీ, యూజీ వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆపరేషన్లు విజయవంతం : కండే శ్యామ్

నంద్యాల అక్టోబర్ 9 (రిపబ్లిక్ న్యూస్) :

ఖండే బ్రదర్స్ నేతృత్వంలో భారత్ వికాస్ పరిషత్,ఆయుష్ యోగా సేవాసమితి, సత్యసాయి వాకర్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయానంద హాస్పిటల్ డాక్టర్ల బృందం సెప్టెంబర్ 26వ తేదీన సిరివెళ్ల గ్రామం నందు ఉచిత కిడ్నీ మరియు కంటి పరీక్షల శిబిరం విజయవంతమైనట్లు ఆర్యవైశ్య నాయకులు టిడిపి నాయకులు కండే శ్యామ్ సుందర్లాల్ పేర్కొన్నారు

ఈ శిబిరానికి 150 మందికి పైగా హాజరు కాగా వారిలో 35 మందికి శుక్లము ఆపరేషన్కు ఎంపిక చేయడం జరిగింది. వీరిలో మొదటి దఫగా 12 మందికి రెండవ దఫా ముగ్గురికి నాలుగో దఫా ఐదు మందికి అనగా ఇప్పటికీ 20 మందికి కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ గారు శుక్రము ఆపరేషన్ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా డాక్టర్ యం భవ్యశ్రీ మాట్లాడుతూ ఆపరేషన్ పూర్తి అయిన వారందరికీ చూపు చక్కగా కనబడుతుందని అలాగే వారికి ఇక్కడ ఉండేటందుకు వసతులు అన్ని చక్కగా ఏర్పాటు చేసి వారిని తిరిగి వారి స్వగ్రామానికి పంపుతూ, వారికి కావాల్సిన చుక్కల మందులను ఉచితంగా ఇస్తూ, వాటిని ఏ విధంగా ప్రతిరోజు ఉపయోగించాలో వివరించి డిశ్చార్జ్ చేయడం జరిగింది అన్నారు ఈ సందర్భంగా ఖండే ఆనంద్ గురూజీ మాట్లాడుతూ గత 20 సంవత్సరముల నుండి యోగా సభ్యులు మరియు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో, వైద్యుల సహకారంతో ఇప్పటికీ 1878





మందికి ఉచితంగా ఆపరేషన్ చేపించామని ఇలాగే ముందు ముందు కూడా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టుటకు మా సత్యసాయి వాకర్స్ క్లబ్ వారు, భారత్ వికాస్ కమిటీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అందరూ ముందుండి సమాజానికి తమ వంతు ఎల్లప్పుడూ సహకార అందిస్తారని, అంతేకాకుండా ఎవరికైనా దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలను కూడా ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలియజేశారు.

మిగిలిన వారు కూడా వారి వసతి చూసుకొని ఉదయానంద హాస్పిటల్ కి వస్తే వారికి కూడా ఉచితంగా శుక్లము ఆపరేషన్ చేయించి పంపగలరని తెలియజేశారు ఈ సందర్భంగా ఖండే శ్యాంసుందర్ లాల్ మాట్లాడుతూ ఇప్పటివరకు మేము సిరివెళ్ల గ్రామంలో అధికంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. భవిష్యత్తులో చుట్టుపక్కల మండలాలలో కూడా చాగలమర్రి, రుద్రవరం గోస్పాడు, బండి ఆత్మకూరు, వెలుగోడు, బేతంచెర్ల, బనగానపల్లె మొదలగు మండలంలలో కూడా మా ఖండే బ్రదర్స్ అయినా ఖండే ఆనంద్ గురించి నేను స్వచ్ఛంద సంస్థలతో కలిసి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నాము

దీన్ని2027 జనవరి నుండి అమలు చేస్తామని తెలియజేశారు వైద్య నిపుణులతో పాటు టెక్నీషియన్లకు అలాగే అశోక్ కుమార్ గారికి అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటు ఇంతమందికి సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించినందుకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు

మేము క్యాంప్స్ నిర్వహించుకొనుటకు ఎల్లప్పుడూ మాకు ఆవాసం కల్పిస్తున్న ఉల్లి నాగేశ్వరుడు కి కూడా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు

రైతు ప్రయోజనాలను తాకట్టుపెట్టి రూ.66 వేలకూ రెండెకరాల భూమి 33 ఏళ్లకు తెలుగు దేశం పార్టీకి అప్పగిస్తారా?

రైతు ప్రయోజనాలను, ఆహార భద్రతను దెబ్బతీసే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి

గాంధీ చౌక్‌లో అఖిలపక్ష ఐక్యవేదిక 'ప్రజా భిక్షాటన'

నంద్యాల అక్టోబర్ 9(రిపబ్లిక్ న్యూస్(:

ప్రజలకు, రైతులకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను రాజకీయ అవసరాలకు కేటాయించడాన్ని నిరసిస్తూ నంద్యాల అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ చౌక్‌లో 'ప్రజా భిక్షాటన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

నూనెపల్లె మార్కెట్ యార్డు భూమి కేటాయింపు రద్దు, ఆర్ ఏ ఆర్ ఎస్ ప్రాంగణంలోని తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే తరలించడం ప్రధాన డిమాండ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు తెలిపారు.

రూ.66 వేలకే 33 ఏళ్లకు రెండెకరాల మార్కెట్ యార్డు భూమి?

"మార్కెట్ యార్డులను అభివృద్ధి చేసి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం, మరోవైపు రైతుల ప్రయోజనాలకు ఉపయోగపడాల్సిన మార్కెట్



యార్డు భూమిని నిర్వీర్యం చేసి రాజకీయ పార్టీ కార్యాలయానికి ఎలా కేటాయిస్తుంది?" అని నాయకులు ప్రశ్నించారు.

నూనెపల్లె మార్కెట్ యార్డుకు చెందిన రెండు ఎకరాల భూమిని 33 ఏళ్లపాటు లీజుకు కేటాయించడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఎకరాకు సంవత్సరానికి రూ.1,000 చొప్పున రెండు ఎకరాలకు ఏడాదికి రూ.2,000, 33 ఏళ్లకు మొత్తం రూ.66,000 మాత్రమే ప్రభుత్వానికి లభిస్తుందని వారు పేర్కొన్నారు.2014 ఆగస్టు 15న ఉమ్మడి కర్నూలు జిల్లాను 'విత్తన రాజధాని'గా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీని వారు గుర్తుచేశారు.

జిల్లాను జాతీయ స్థాయి విత్తన కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన సమయంలో, వ్యవసాయ పరిశోధనలకు అంకితమైన ఆర్ ఏ ఆర్ ఎస్ ప్రాంగణంలోనే తాత్కాలిక కలెక్టరేట్‌ను కొనసాగించడం వల్ల పరిశోధనా మౌలిక వసతులు, భూములు, భవిష్యత్ వ్యవసాయ అవసరాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ ఏ ఆర్ ఎస్ ప్రాంగణంలోని తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే ప్రత్యామ్నాయ ప్రదేశానికి తరలించాలని, ఆర్ ఏ ఆర్ ఎస్ పరిశోధనా భూములు, ప్రయోగశాలలు, మౌలిక వసతులను పూర్తిగా పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ తరలింపు కోసం కూడా అవసరమైతే ప్రజల నుంచి ప్రతీకాత్మకంగా నిధులు సమీకరించి ప్రభుత్వానికి అందించడానికి సిద్ధంగా ఉన్నామని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు తెలిపారు.

రాయలసీమకు సంబంధించిన సమస్యలపై టిడిపి జనసేన బిజెపి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లతో సహా అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు స్పందించాలని కోరారు.

రాయలసీమ ప్రజల సమస్యలు, హక్కులు, అభివృద్ధి అంశాలపై రాజకీయ పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను నిర్మించాల్సిన అవసరంపై ప్రజలతో కలిసి ఆలోచించాల్సి వస్తుందని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు తెలిపారు.

. నూనెపల్లె మార్కెట్ యార్డులో రెండు ఎకరాల భూమి కేటాయింపును తక్షణమే రద్దు చేయాలి. ఆర్ ఏ ఆర్ ఎస్ ప్రాంగణంలోని తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే తరలించాలి.. ఆర్ ఏ ఆర్ ఎస్ ను వ్యవసాయ పరిశోధనలకు అనుగుణంగా మరింత బలోపేతం చేయాలి. ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలి డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ఎస్ డి పి ఐ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఏజెస్ హుస్సేన్, సిపిఐ నాయకులు బాబా ఫక్రుద్దీన్, క్రిస్టియన్ జేఏసీ నాయకులు జానయ్య, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు రామకృష్ణారెడ్డి, అనంతపురం జలసాధన సమితి కన్వీనర్ రామ్ కుమార్, కర్నూలు జిల్లా జలసాధన సమితి కన్వీనర్ శేషాద్రిరెడ్డి, విరసం నాయకులు అరుణ్, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు భాస్కర్ రెడ్డి, కర్నూలు జిల్లా రైతు నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ముస్లిం ఐక్యవేదిక నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ షేక్ పెద్ద మున్నా, మున్సిపల్ కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ శంకరయ్య, మజీద్ ఖాన్, వాల్మీకి సంఘం అధ్యక్షులు బోయ పులికొండన్న, ఎస్ ఆర్ బి సి రైతు సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, ఏరువ రామిరెడ్డి, తెలుగుగంగ ఆయకట్టు రైతు నాయకులు సాకేశ్వరరెడ్డి, సదాశివారెడ్డి, కె సి కెనాల్ ఆయకట్టు రైతు నాయకులు చిన్న రామకృష్ణారెడ్డి, వెలుగోడు మండల రైతు సంఘం నాయకులు భాస్కర్, నస్రుల్లాఖాన్, గడివేముల మండల రైతు నాయకులు రామ్మోహన్, సంజీవరెడ్డి, పాణ్యం మండల రైతు నాయకులు మురళీధర్, గోస్పాడు మండల రైతు నాయకులు సుబ్బారెడ్డి, నంద్యాల మండల రైతు నాయకులు కృష్ణారెడ్డి, బండిఆత్మకూరు రైతు సంఘం నాయకులు నారాయణ, శివరామిరెడ్డి, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు షణ్ముఖరావు, సమితి కార్యవర్గ సభ్యులు, రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

7 టన్నుల కాపర్ వైర్ దొంగతనం కేసు ఛేదింపు

ఇద్దరు అంతర్రాష్ట్ర ముద్దాయిల అరెస్ట్, లారీ మరియు కాపర్ వైర్ స్వాధీనం.

రేణిగుంట అక్టోబర్ :9(రిపబ్లిక్ న్యూస్)
తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, రేణిగుంట డి.ఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో, రేణిగుంట అర్బన్ సి.ఐ ఎస్. జయచంద్ర, ఎస్సై వై. శ్రీనివాసులు మరియు సిబ్బంది పక్కా సమాచారంతో కాపర్ వైర్ దొంగతనం కేసును ఛేదించి, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి సుమారు రూ. 1.20 కోట్ల విలువైన 7 టన్నుల కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టయిన నిందితుల వివరాలు:
ఆర్. రాజా (35 సం.), తం/పే: రామస్వామి, డోర్ నెం: 137, రామకృష్ణాపురం గ్రామం, వెప్పలయి పోస్ట్, కాట్పాడి మండలం, వేలూరు జిల్లా, తమిళనాడు.కె. నవీన్ కుమార్ (39 సం.), తం/పే: కాశి, డోర్ నెం: 10, భజన కోయిల్ వీధి, కొడుక్కంతంగళ్ గ్రామం, కాట్పాడి మండలం, వేలూరు జిల్లా, తమిళనాడు.
ఈ కేసులో ప్రధాన నిందితుడు లారీ డ్రైవర్/ఓనర్ వినోద్ కుమార్ మరియు మరో నిందితుడు దినేష్ పరారీలో ఉన్నారు.తమిళనాడుకు చెందిన వినోద్ కుమార్ తన లారీని (నెం: TN 23 DC 4177) బెంగుళూరులోని 'న్యూ నాగూర్ అందవార్ ట్రాన్స్‌పోర్ట్' ద్వారా నడుపుతుంటాడు. గత నెల 16-09-2026న బెంగుళూరులోని 'వేదాంత లిమిటెడ్ - స్టార్‌లైట్ కాపర్ కంపెనీ' నుండి సుమారు 7 టన్నుల కాపర్ వైరును శ్రీసిటీకి తరలించేందుకు లోడ్





చేసుకున్నాడు. అయితే, ఆ సరుకును చేరవేయకుండా దొంగిలించి అధిక లాభాలకు అమ్ముకోవాలని తన స్నేహితులైన రాజా, నవీన్ కుమార్, దినేష్‌లతో కలిసి పథకం వేశాడు.పథకం ప్రకారం 17-09-2026 రాత్రి వేలూరు సమీపంలోని చెరువు వద్దకు లారీని తెచ్చి, జేసీబీ సాయంతో గుంత తవ్వి కాపర్ వైరును అందులో పాతిపెట్టారు. అనంతరం లారీని ఎవరికీ అనుమానం రాకుండా తిరుపతి జిల్లా రేణిగుంటలోని రమణ విలాస్ సర్కిల్ సమీపంలో గల జామ్ జామ్ హోటల్ పక్కన ఉన్న లారీ పార్కింగ్‌లో వదిలేసి పరారయ్యారు. మార్కెట్‌లో కాపర్ వైర్ ఎవరూ కొనకపోవడంతో, లారీని తిరిగి తీసుకువెళ్లేందుకు నిందితులు రాజా, నవీన్ కుమార్‌లు ఈరోజు (09-10-2026) రేణిగుంట లారీ పార్కింగ్ వద్దకు రాగా పోలీసులు మాటువేసి పట్టుకున్నారు.

రికవరీ వివరాలు:
- సుమారు రూ. 1,20,00,000/- (కోటి ఇరవై లక్షలు) విలువైన 7 టన్నుల కాపర్ వైర్ - రవాణాకు ఉపయోగించిన లారీ (నెం: ఎచీ 23 ణజ 4177)

పోలీస్ సిబ్బందికి ప్రశంసలు:
ఈ కేసును త్వరితగతిన ఛేదించడంలో చురుగ్గా వ్యవహరించిన పోలీసు సిబ్బంది మురళి, రమేష్, రాజశేఖర్, శ్రీను, గౌరి నాయుడు, బాదుర్షా, చలపతి ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను ప్రకటించారు.

పామిడిలో ఘనంగా 'సేవా సంకల్ప్ అభియాన్' చిత్రలేఖన పోటీలు

పామిడి, అక్టోబర్ 09(రిపబ్లిక్ న్యూస్)
పామిడి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యా మందిరం నందు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా 25 కోట్ల చిన్నారుల కలల చిత్రలేఖన పోటీలు అత్యంత ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రధానాచార్యులు సి.ఆర్. శ్రీనివాసరావు, పామిడి బీజేపీ మండల అధ్యక్షులు చౌహాన్ అంజి నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ఆల్ సేల్స్ కన్వీనర్, ఎక్స్ ఆర్మీ జేసీవో శ్రీ కణంపల్లి చిరంజీవి రెడ్డి,అనంతపూర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ కొనకొండ్ల రాజేష్ విచ్చేశారు.ఈ చిత్రలేఖన పోటీలలో పాఠశాలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీలను రెండు విభాగాలుగా (6, 7, 8 తరగతులు ఒక విభాగంగా.. 9, 10 తరగతులు మరో విభాగంగా) నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.మొదటి విభాగం (6,7,8 తరగతులు): ఎమ్. హర్షద్ కుమార్, వై. వైష్ణవి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.రెండో విభాగం (9,10 తరగతులు): పి. ఉషశ్రీ,



ఎన్. జయలక్ష్మి, మహీధర్ రెడ్డి, కె.పి . ముకేష్ రెడ్డి, కరిష్మా, హిమబిందు విజేతలుగా నిలిచారు.ఈ కార్యక్రమంలో గార్లదిన్నె బీజేపీ మండల అధ్యక్షులు చాణిక్య, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్, పవన్ కుమార్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ పూజారి లక్ష్మీదేవి, రాజశేఖర్ గౌడ్, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పుల్లా చౌడయ్య, యువ మోర్చా మండల అధ్యక్షులు నరేంద్ర, విష్ణుకాంత్ రావు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు నరేష్ యాదవ్, రామ్ నరేష్, సరస్వతి విద్యా మందిరం ఉపాధ్యాయ బృందం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంతటి ఘన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ భారతీయ జనతా పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

21కోట్లతో ఆళ్లగడ్డ పురపాలక పరిధిలో అభివృద్ధి కొరకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

ఆళ్లగడ్డ అక్టోబర్ 9రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డపట్టణం లోని మున్సిపల్ కార్యాలయం ఆవరణంలోఆళ్లగడ్డపురపాలక పరిధిలో రోడ్లు,మున్సిపల్ బిల్డింగ్, సెంట్రల్ లైటింగ్,మరియు పార్కుల అభివృద్ధి కొరకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణానికి సంబంధించి హ్యామ్ కింద 21 కోట్ల రూపాయలు కేంద్రం నుండి మంజూరు ఐయ్యయని ఆళ్లగడ్డపట్టణ అభివృద్ధి ని దృష్టిలో పెట్టుకొని 21 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడు కి, పీఎం మోడీకి నా తరపున మరియు మాటీడీపీ కార్యకర్తల తరపున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము..ఆళ్లగడ్డ పట్టణానికి కాకుండా ఎన్నో ప్రాంతాలకు కొన్ని వేల కోట్లు మంజూరు చేయడంతో వైసీపీ నాయకులకు మతి బ్రమించి పోయింది ఎలా ఇవన్నీ చేయగలుగుతున్నారని, రాబోయే రోజుల్లో ఎన్నికల్లో మేము ఎలా వెళ్లి ఓట్లు అడగాలా అనే ఆలోచనలో ఉన్నారు.గతంలో 8 కోట్ల రూపాయలతో ఆళ్లగడ్డ ప్రాంతంలో డెవలప్మెంట్ చేయడం అలాగే ఆళ్లగడ్డ పట్టణం కు సంబంధించి రోడ్లు డ్రైనేజీలు కాలువలు ఇలా ఎన్నో విధాలుగా అభివృద్ధి పనులు చేయడం జరిగిందని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.మొన్నటికి మొన్న టిట్కో గృహాల్లో నేను వెళ్ళినప్పుడు చాలామంది సమస్యలు తెలియజేయడం జరిగింది ఎందుకంటే వారు హైవేలో టిడ్కో గృహాలకు వెళ్లే సమయంలో ప్రమాదం లో 8 మంది దాకా చనిపోవడం జరిగిందని, టిట్కో ఎండీ నంద్యాలకు వచ్చాడని విషయం తెలుసుకుని, ఆయనను కలిసి చింతకుంట్ల కు వెళ్లే మట్టి



రోడ్డుకు మెయిన్ రోడ్డు 70 లక్షల రూపాయలతో శాంక్షన్ చేపించడం జరిగిందని,టిట్కో లొ 50 లక్షల రూపాయలతో పార్కు నిర్మాణానికి శాంక్షన్ చేపించడం జరిగింది.
మేము ప్రతి ఒక్కటి ఆళ్లగడ్డ తాలూకాలో అభివృద్ధి చేస్తూనే ఉన్నామని తెలియజేశారు, బిసి రిజర్వేషన్ కోసం మేము పోరాడుతుంటే, ఈరోజు సుప్రీంకోర్టు రిజర్వేషన్ రద్దు చేసిందని వైసీపీనాయకులు ఆనందపడుతున్నారు, బీసీల కోసం పోరాడే విషయంలో మా ప్రభుత్వం ఎప్పుడు ముందు ఉంటుందని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.ఈరోజు వైసీపీ నాయకులు అన్నా క్యాంటీన్లో అన్యాయాలు అక్రమాలు జరుగుతున్నాయి సరైన భోజనం పెట్టడం లేదంటూ వారి పేటియం బ్యాచ్ తో వీడియోలు వైరల్ చేపించడం జరిగింది, ఈరోజు నేను మరియు ఫుడ్ కమిషనర్,సి ఐ అందరూ వెళ్లడం జరిగింది అక్కడ అంతా బాగుంది, అన్న క్యాంటీన్ అనేది ఆంధ్ర రాష్ట్రమంతటా ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ సెంట్రలైజ్ ఫుడ్ కిచెన్ ద్వారా పంపించడం జరుగుతుంది, వాసన వస్తే కడప



నంద్యాల అన్నిచోట్ల రావాలి కానీ ఒక ఆళ్లగడ్డలోని ఎలా వస్తుంది ఇవన్నీ కల్పితలు వైసీపీ నాయకులు కావాలని చేస్తున్నారని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.కూటమి ప్రభుత్వం కోసం జనసేన బీజేపీ మేమందరము కష్టపడి ప్రభుత్వాన్ని ఏర్పరచుకున్నామని, మళ్లీ వస్తే స్థానిక ఎన్నికల్లో వైసిపి నాయకులు మేమేదో పోటీ చేస్తామని అంటున్నారు, మీరు కేవలం పోటీ మాత్రమే చేస్తారు ప్రతి ఒకచోట మేమే గెలిచి చూపిస్తామని వైసిపి నాయకులకు హెచ్చరించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.గతంలో మా వాళ్లను నామినేషన్ కూడావేయనీయకుండా స్టేషన్లో కూర్చోబెట్టి ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు, అవన్నీ ప్రజలందరూ గుర్తుపెట్టుకున్నారని ఎవరు మర్చిపోలేదని తెలియజేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ కిషోర్, టీడీపీ నాయకులు మాజీ కౌన్సిలర్ హుస్సేన్ బాషా, సలాం, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, నాగాంజి, మోహన్ రెడ్డి, శేకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

ఆళ్లగడ్డ అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ పట్టణం లోని అన్న క్యాంటీన్‌లో నాణ్యత లోపించిందంటూ సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి భరోసాగా ఉండాల్సిన చోట ఎటువంటి లోపాలు తలెత్తకూడదనే ఉద్దేశంతో, ఈరోజు ఆళ్లగడ్డ అన్న క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించామని క్యాంటీన్‌లో వడ్డిస్తున్న భోజన నాణ్యతను, సదుపాయాలను స్వయంగా పరిశీలించడంతో పాటు, అక్కడ భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నాం. పేద ప్రజల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లలో నాణ్యత విషయంలో



ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు. ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని, ప్రతి ఒక్కరికీ రుచికరమైన, పరిశుభ్రమైన పౌష్టికాహారం అందేలా



కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ప్రజల సంక్షేమమే మా మొదటి ప్రాధాన్యతఅని ఎమ్మెల్యే తెలిపారు.

గర్భిణులకు అన్నదానం

వజ్రకరూరు: అక్టోబర్ 9(రిపబ్లిక్ న్యూస్)
మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాల మహానాడు అధ్యక్షుడు మొలక బాల రామాంజనేయులు ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, ఎంపీడీవో పి. శివనాగజ్యోతి, ఎస్ఐ నాగస్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ బెన్ సంజీవ్ మాట్లాడుతూ.. గర్భిణులు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని, ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలోనే ప్రసవం జరిగేలా చూసుకోవాలని, దీనివల్ల తల్లీబిడ్డలు సురక్షితంగా ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో గురుప్రసాద్, కుమారస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు సుశీల, నాగశంకర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతన ఎరువుల విధానంపై అవగాహన

డీలర్లు, వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

గుత్తి అక్టోబర్ 9 (రిపబ్లిక్ న్యూస్)
రైతులకు ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంచి, అవసరమైన సమయంలో ఎరువులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నూతన విధానాన్ని అమలు చేస్తున్నట్లు గుత్తి ఏడీఏ వెంకటరాముడు తెలిపారు. ఈ విధానంపై గుత్తి డివిజన్ వ్యవసాయ సిబ్బంది,



ఎరువుల డీలర్లకు స్థానిక సీహెచ్ఆర్సీ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడీఏ వెంకటరాముడు మాట్లాడుతూ.. రైతులు తమ ఆధార్ నంబరు లేదా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబరుతో అవసరమైన ఎరువులను ముందుగానే నమోదు చేసుకోవచ్చని వివరించారు. రైతులు నమోదు చేసిన వివరాల ఆధారంగా డీలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓ), రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) సిబ్బంది ఎరువుల పంపిణీ చేపట్టాలని సూచించారు. ఈ విధానంతో పంపిణీలో పారదర్శకత పెరిగి, రైతులకు సౌకర్యవంతమైన సేవలు అందుతాయన్నారు.వ్యవసాయ అధికారి మెహబూబ్ బాషా నూతన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువుల నమోదు ప్రక్రియను వివరించారు. రైతుల నుంచి ఎరువుల ఇండెంట్లు స్వీకరించడం, పంపిణీ వివరాలను యాప్‌లో నమోదు చేయడం, డిజిటల్ విధానంలో డేటాబేస్ నిర్వహణ తదితర అంశాలపై ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇచ్చారు. రైతులు పంట అవసరాలకు అనుగుణంగా ఎరువులను సరైన మోతాదులో వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ముస్తాక్ అహమ్మద్, మునిస్వామి, విజయకుమార్, అన్వేష్‌కుమార్, మెహబూబ్ బాషా, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), ఆర్ఎస్‌కే సిబ్బంది, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

11న ఆదివారం మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య

ఆళ్లగడ్డ అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్
ఈనెల 11వ తేదీన ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా మైలేరి సురేఖ ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయాలని ఆళ్లగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్యకోరారు. ఈ సందర్భంగా మీడియాతో మైలేరి మల్లయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీ. ఎం పవన్ కళ్యాణ్,ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆశీస్సులతో తన సతీమణి మైలేరి సురేఖ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ఎంపిక అయి ఈ నెల 11నఆదివారం ఉదయం 11-30గంటలకు ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ ప్రాంగణం లో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. తమపై ఎంతో నమ్మకంతో మార్కెట్ యార్డ్ చైర్మన్గా ఎంపిక చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. చైర్మన్గా తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధత తో నెరవేర్చి మార్కెట్ యార్డ్ ను జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తామని మైలేరి మల్లయ్య తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని మైలేరి మల్లయ్య విజ్ఞప్తి చేశారు.

టీడీపీ పార్టీ ఉత్తమ కార్యకర్తగా నన్నే బాయి జిలాని బాషా ఎంపిక

ఆళ్లగడ్డ అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ టిడిపి పార్టీ ఉత్తమ కార్యకర్తగా నన్నెబాయి జిలాన్ భాషా కి అవార్డు రావడం జరిగింది . ఈ అవార్డును టీడీపీ సీనియర్ నాయకులు భార్గవరామ్ చేతులమీదుగా అందుకోవడం జరిగింది .ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ ఈ అవార్డు వచ్చినందుకు భూమా అఖిలమ్మకి, భార్గవ్ రామ్ కి, నారా చంద్రబాబు నాయుడు కి, నారా లోకేష్ అన్న కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



ప్రత్యేక ప్రజా గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ





ఆళ్లగడ్డ అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్
ఈరోజు ఆళ్లగడ్డపట్టణం లోని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆళ్లగడ్డ నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలు వారి సమస్య లను, ఇబ్బందులను,ఎమ్మెల్యే దృష్టికి తీసుకరావడం జరిగింది అన్నీ శ్రద్ధగా విని వారి



అర్జీలను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, ప్రతి ఒక్కరి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే మన కూటమి ప్రభుత్వ లక్ష్యం.ఎమ్మెల్యే అన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే వారికి బీసీవై పార్టీ అండ

గుత్తిలో రాష్ట్ర సమన్వయ సమావేశం



గుత్తి అక్టోబర్ 9 (రిపబ్లిక్ న్యూస్)



బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు గుత్తి మండల కన్వీనర్ పోతుల వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం గుత్తి పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో పార్టీ రాష్ట్ర సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో కులమతాలకు అతీతంగా పార్టీ తరఫున పోటీ చేయాలనుకునే ఆశావహులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అర్హులకు బీ-ఫారాలు ఇచ్చి ఎన్నికల్లో పోటీ చేసేలా ప్రోత్సహిస్తామని, పార్టీ వారికి అండగా ఉంటుందని తెలిపారు.ప్రభుత్వాలు మారుతున్నా ప్రజలను పాలకులుగా కాకుండా దాసులుగా చూసే విధానమే కొనసాగుతోందని విమర్శించారు. బీసీవై పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలే రాజులుగా ఉండే పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చిన ప్రతి ఒక్కరూ పార్టీలో చేరి బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర సమన్వయ కమిటీ, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు, బీసీ సంఘాల ప్రతినిధులు, రాష్ట్ర సమన్వయ కమిటీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బెస్త పవన్ కుమార్, దేరంగుల లక్ష్మి దేవమ్మ, రాజన్, నరసింహారావు,వాల్మీకి అర్జున్, సురేష్, రామ్మోహన్, పాటు బీసీవై పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్త మద్యానికి బానిస కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య....

రేణిగుంట అక్టోబర్ :9(రిపబ్లిక్ న్యూస్)



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం, కట్టకిందపల్లి (ఉప్పువడ్డేపల్లి) గ్రామానికి చెందిన ఎం. రవి, ఎం. సులోచన దంపతుల కుమార్తె కీర్తి (30)కి, సోమల మండలం వడ్డిపల్లికి చెందిన సునీల్ కుమార్‌తో దాదాపు 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె (11), కుమారుడు (9) ఉన్నారు. ప్రస్తుతం వీరు రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామ నగర్ (ప్లాట్ నెం. 2110) నందు నివాసం ఉంటున్నారు. సునీల్ కుమార్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.అయితే సునీల్ కుమార్ మద్యానికి బానిసై సంపాదనను వ్యసనానికే ఖర్చు చేస్తూ, కుటుంబ బాగోగులు పట్టించుకోకుండా ఉండేవాడు. ఈ విషయమై పెద్దలు పలుమార్లు సర్దిచెప్పినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో 08-10-2026 రాత్రి సుమారు 9:00 గంటల సమయంలో సునీల్ కుమార్ మద్యం తాగి ఇంటికి రావడంతో దంపతుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం రాత్రి సుమారు 11:00 గంటలకు ఇంట్లో అందరూ నిద్రపోయిన సమయంలో తీవ్ర మనస్తాపానికి గురైన కీర్తి, బయటకు వచ్చి గడియపెట్టి, ఇంటి బయట వరండాలోని పైకప్పు ఇనుప కడ్డీకి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.మధ్యరాత్రి సుమారు 12:15 గంటల సమయంలో మెలకువ వచ్చి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న మృతురాలి తల్లి ఎం. సులోచన ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి రుయా/ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దసరా ధమాకా ఆఫర్ లో భాగంగా ఇస్కాల గ్రామంలో స్వచ్ఛ రథం ద్వారా పొడి చెత్త సేకరణ

పొడి చెత్త సేకరణ ఎస్ డబ్ల్యూపిసి షెడ్‌లో వర్మీ కంపోస్ట్ తయారీ ప్రక్రియ పరిశీలించిన ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్



పాములపాడు అక్టోబర్-9 రిపబ్లిక్ న్యూస్:- పాములపాడు మండలంలోని, ఇస్కాల గ్రామ పంచాయతీ పరిధిలో ఈరోజు స్వచ్ఛ రథం ద్వారా పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, తడి చెత్త మరియు పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.దసరా ధమాకా ఆఫర్‌లో భాగంగా మండలంలోని, ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో 10 కిలోల కంటే ఎక్కువ పొడి చెత్తను అందించిన వారికి టోకెన్లు అందించి, లక్కీ డిప్ ద్వారా ఆకర్షణీయమైన బహుమతులను అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, పొడి చెత్త సేకరణలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నామని అన్నారు.అనంతరం ఆయన అధికారులతో కలిసి ఇస్కాల గ్రామంలోని, సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్ డబ్ల్యూ పిసి) షెడ్‌ను సందర్శించారు. అక్కడ వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియను పరిశీలించి, వ్యర్థాల నిర్వహణ, సేంద్రియ ఎరువుల తయారీ, షెడ్ నిర్వహణకు సంబంధించి తగిన సూచనలు అందించారు. పరిశుభ్రమణ గ్రామాలు -ఆరుగురుకరమైన సమాజం, పొడి చెత్తను వేరు చేయండి-స్వచ్ఛ రథానికి అందించండి-ఆకర్షణీయమైన బహుమతులు గెలుచుకోండని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ తిరుపాలు, స్వర్ణ గ్రామస్వర్ణ వార్డు మండల అధికారి సులోచన, ఇస్కాల గ్రామ పంచాయతీ పి.నాగ శేషులు, అభివృద్ధి అధికారి (పి డి ఓ) తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అంతరిక్ష వారోత్సవాల్లో రాఘవేంద్ర స్కూల్ విద్యార్థిని ప్రతిభ

క్విజ్ పోటీల్లో సత్తా చాటిన 9వ తరగతి విద్యార్థిని ధరణి

ఇస్రో శాస్త్రవేత్త అడిషనల్ ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేత

హర్షం వ్యక్తం చేస్తున్న పాఠశాల యాజమాన్యం



బాలికను అభినందిస్తున్న కరస్పాండెంట్ బిజ్జం వెంకటసుబ్బారెడ్డి



ఇస్రో ప్రతినిధి, అడిషనల్ ఎస్పీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని ధరణి

బండి ఆత్మకూరు, అక్టోబర్ 9,(రిపబ్లిక్ న్యూస్):-

నంద్యాలలోని ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఇటీవల ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా కళాశాల యాజమాన్యం నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఈకార్యక్రమానికి ఆహ్వానించారు. అలాగే విద్యార్థుల మధ్య డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ వంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు ఇస్రో శాస్త్రవేత్తల చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఇందులో భాగంగా బండి ఆత్మకూరులోని రాఘవేంద్ర హై స్కూల్ కి చెందిన 9వ తరగతి విద్యార్థిని ధరణి క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచిందనీ కరస్పాండెంట్ బిజ్జం వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినికి అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ప్రతినిధి, నంద్యాల అడిషనల్ ఎస్పీ సుస్మిత చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థిని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయంతో ధరణికి శాస్త్ర విజ్ఞానంపై ఉన్న ఆసక్తికి ప్రతీకగా నిలుస్తోందని కరస్పాండెంట్ తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఈ ఘనత సాధించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శుక్రవారం ధరణిని అభినందించారు. అలాగే ఆ బాలిక విజయంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయ సిబ్బందినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఏవో రోకియా బేగం, ఉపాధ్యాయ సిబ్బంది జయప్రకాశ్ రెడ్డి, సుధాకర్, శివలింగం తదితరులు ఉన్నారు.

మాపై ఎందుకింత కక్ష

కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు, నర్సుల సూటి ప్రశ్న -4వ రోజు కొనసాగిన కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగుల సమ్మె

న్యాయమైన హక్కుల కోసం పోరాడితే షోకాజ్ నోటీసులా..

జేపసీ ఛైర్మన్ శరత్, కో ఛైర్మన్ వెంకట్ కి కూడా షోకాజ్ నోటీసులు -అయినా వెనక్కు తగ్గమన్న కాంట్రాక్టు ఉద్యోగులు





అనంతపురం వైద్యం, అక్టోబర్ 09,(రిపబ్లిక్ న్యూస్):

న్యాయమైన హక్కుల కోసం పోరాటం చేస్తుంటే షోకాజ్ నోటీసులు ఇస్తారా.. సీఎం చంద్రబాబు గారు మాపై ఎందుకింత కక్ష అని కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె 4వ రోజు కూడా కొనసాగింది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలోని వివిధ విభాగాల్లోని కాంట్రాక్టు ఉద్యోగులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. పూర్తి స్థాయిలో విధులను బహిష్కరించి పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రితో పాటు జిల్లాలోని అన్ని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమ్మెలో భాగంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అహుడా చైర్మన్ టిసి వరుణ్ కు వినతిపత్రం అందజేశారు.

20 ఏళ్లుగా ఆసుపత్రులలో రాత్రింబగళ్లు వెట్టిచాకిరి

నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు పలువురు నర్సులు మాట్లాడారు. సీఎం సర్.. మేము మీకు ఎప్పటి నుంచో మీకు సపోర్ట్ చేస్తూ వస్తున్నామన్నారు. అయినా మీకెందుకు నర్సులు అంటే అంత కక్ష అని సూటిగా ప్రశ్నించారు. 16 ఏళ్ల నుండి 20 ఏళ్లుగా తాము ఆసుపత్రులలో రాత్రింబగళ్లు వెట్టిచాకిరి చేస్తున్నామన్నారు. ఇంత కాలం శ్రమిస్తున్నా తమకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం, కుటుంబాల మనుగడ కోసం శాంతియుతంగా పోరాడుతుంటే, జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు జేఏసీ ఛైర్మన్ శరత్, కో ఛైర్మన్ వెంకట్, పలు పీహెచ్‌సీలలోని స్టాఫ్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై నర్సులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోగుల కష్టాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి

నోటీసులకు తాము భయపడే ప్రసక్తే లేదని, బెదిరింపులతో ఉద్యమాన్ని అణచలేరని స్పష్టం చేశారు. తక్షణమే నోటీసులను ఉపసంహరించుకుని, రెగ్యులరైజేషన్, వంద శాతం పూర్తి వేతనం వంటి డిమాండ్లపై ప్రభుత్వం జీఓలు విడుదల చేసే వరకు వెనక్కి తగ్గేదే లేదని భీష్మించుకు కూర్చున్నారు. అక్టోబర్ 3 డెడ్‌లైన్ ముగిసినా కాలయాపన చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, రోగుల కష్టాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో రెగ్యులర్ యూనియన్ నాయకులు ఆర్.బి పద్మ, లత, సంధ్యా, అరుణ, సిఐటియు నాయకులు ఆర్.వి నాయుడు, నాగేంద్ర. కుళ్లాయప్ప, హైకోర్టు అడ్వకేట్ శివరామకృష్ణ, డిస్కవరీ ఛానల్ అనిల్ తదితరులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు.

బీసీల ద్రోహి సీఎం చంద్రబాబు

బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి వెన్నుపోటు - 34 శాతం రిజర్వేషన్ల పేరుతో దొంగ నాటకాలు

అంబేద్కర్ విగ్రహం ఎదుట వైసీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం -వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్

అనంతపురం ప్రతినిధి, అక్టోబర్ 09, (రిపబ్లిక్ న్యూస్):

టీడీపీ బీసీల పార్టీ అని చెప్పుకుంటూ చంద్రబాబు ప్రతిసారీ అధికారంలోకి వస్తున్నారని, గద్దెనెక్కిన తర్వాత మాత్రం బీసీలను నట్టేట ముంచుతున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటుతున్నాయన్న కారణంతో 34 శాతం బీసీ రిజర్వేషన్ల జీవోలను హైకోర్టు కొట్టివేసింది. ఆ తీర్పుపై ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను ఈరోజు సుప్రీంకోర్టు కూడా కొట్టివేసింది. 50 శాతం పరిమితి ఉందని ముందే తెలిసి కూడా, రాజ్యాంగ సవరణ లేదా పార్లమెంట్‌లో చట్టం కోసం ప్రయత్నించకుండా కోర్టులో నిలవని జీవోలు ఇచ్చి చంద్రబాబు నాటకం ఆడారని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామి అయినా బీసీల కోసం పార్లమెంట్‌లో ఎందుకు బిల్లు పెట్టించలేదని వారు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల సమయంలో బీసీలకు ఎన్నో హామీలు ఇచ్చి, వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు అదే బీసీలకు వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని, వారి సంక్షేమాన్ని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని అన్నారు.

రాబోయే రోజుల్లో బీసీలే తగిన గుణపాఠం చెబుతారు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు





పెడుతున్నారని రమేష్ గౌడ్ ఆరోపించారు. బీసీల పార్టీ అని చెప్పుకుంటూనే చంద్రబాబు బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో కూటమి ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. చంద్రబాబు బీసీల ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. బీసీలను గౌరవించి, వారికి ఉన్నత పదవులు ఇచ్చిన ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని రమేష్ గౌడ్ గుర్తుచేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో బీసీలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీసీల హక్కుల కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. "ఖబడ్దార్ చంద్రబాబు, బీసీలను మోసం చేస్తే ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు.

చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ నాయకులు కేవీ రమణ, మీసాల రంగన్న, రిలాక్స్ నాగరాజు, చింతకుంట మధు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి చంద్రబాబు బీసీలను మోసం చేస్తున్నారని, చంద్రబాబు బీసీలకు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని బీసీల పక్షాన నిలబడతామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొగటం విజయ భాస్కర్ రెడ్డి, చింత సోమశేఖర్ రెడ్డి, ఓబి రెడ్డి, చామలూరు రాజ గోపాల్, సాకే చంద్ర శేఖర్, సంపంగి రామాంజనేయులు, ఎద్దుల అమర్‌నాథ్ రెడ్డి, వేముల నదీం, ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్, మొఘల్ సైపుల్లా బేగ్, ధన, సీఎం బాలాజీ, హేమ కిరణ్, నరేంద్ర, అంజలి, భారతి, కృష్ణవేణి, కమర్తాజ్, దేశాయి భారతీ రెడ్డి, రాధా యాదవ్, శోభా భాయ్, మాలపాటి శ్రీనివాసులు, శ్రీనివాస్ దత్తా, భారతి, మాజీ జడ్పీ వైస్ చైర్ పర్సన్ నాగ రత్నమ్మ, పార్వతి, రామాంజనేయులు, ఫణీంద్ర, దేశాయి భారతీ రెడ్డి, లబ్బె రాఘవ, శ్రీనివాసులు, శేఖర్, గోగుల పుల్లయ్య, రాధా యాదవ్, బెస్త వెంకటేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూపతిపూర్ పీఏసీఎస్ నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు. తెలిపిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్





రాయికల్ మండలం అక్టోబర్,09(రిపబ్లిక్ న్యూస్)జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన కార్యవర్గ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ని,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.పీఏసీఎస్ నూతన కార్యవర్గ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కి నూతన కార్యవర్గ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ నూతనంగా నియమితులైన పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమం, సహకార రంగ అభివృద్ధికి నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రావు,మహేందర్, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మల శేఖర్ రెడ్డి, డైరెక్టర్లు రౌట్ల కిష్టయ్య, అచ్చ గంగు, మంత్రి జలంధర్, అల్లాల లత, కొత్తకొండ శ్రీనివాస్, అనుగంటి రాధా, ముద్దం రమేష్, అనుపురం రాజాగౌడ్, మాలోత్ రాజు నాయక్ ,ముంజం రాజేందర్, అమిరిశెట్టి, నరేందర్, దంటికా రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా ముందస్తు దసరా, బతుకమ్మ ఉత్సవాలు





రాయికల్ మండలం అక్టోబర్,09(రిపబ్లిక్ న్యూస్) జగిత్యాల జిల్లా రాయికల్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముందస్తు దసరా, బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆరు అడుగుల బతుకమ్మను అందంగా పేర్చారు. విద్యార్థులు వివిధ రకాల రంగురంగుల పూలతో తమ ఇళ్ల వద్ద బతుకమ్మలను పేర్చి పాఠశాలకు తీసుకువచ్చారు.అనంతరం బతుకమ్మ పాటలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు బతుకమ్మ ఆటలు, దాండియా నృత్యాలు, కోలాటాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.బతుకమ్మ ఉత్సవాల అనంతరం పాఠశాల డైరెక్టర్ జూపల్లి తిరుపతిరావు రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు ఎంతో ఆసక్తిగా, ఆనందంగా తిలకించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.తెలంగాణ సంస్కృతి మన గర్వం బతుకమ్మ మన ఆత్మగౌరవం విజయదశమి మన విజయానికి ప్రతీక! అని తిరుపతిరావు అన్నారు

విద్యుత్ను పొదుపుగా వాడాలి

సింగరావు పేట లో 100 కె.వి ట్రాన్స్ఫరము ప్రారంభించిన సందర్భంగా -ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్





రాయికల్ మండలం అక్టోబర్ 09(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండల సింగరావు పెట్ గ్రామంలో లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి గాను 100కెవి ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేసి ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్తు పొదుపుగా వాడాలని ప్రజలకు విద్యుత్తు 200 యూనిట్ల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇవ్వడం జరుగుతుందని అందుకే పొదుపుగా వాడితే రాష్ట్రానికి లాభం అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారుఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెళ్ళి గంగారెడ్డి, సర్పంచ్ కృష్ణ మూర్తి,పాక్స్ చైర్మెన్ లు తంగెళ్ల రమేష్,ఏనుగు మల్లారెడ్డి, ఎంపిడిఓ చిరంజీవి,ఏ డి ఈ సింధుర్ శర్మ,కోల శ్రీనివాస్,ఏ ఈ నవీన్,మాజీ సర్పంచ్ రాము,రవి గౌడ్,సాయి రెడ్డి,సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుష్పాల ఆరాధనే బతుకమ్మ వేడుక!

నేటి నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు..

రాయికల్ మండలం అక్టోబర్,09(రిపబ్లిక్ న్యూస్)

పూలనే దేవతగా కొలుస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ,మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర పండుగగా విశిష్ట గుర్తింపు పొంది,తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతుందని రాయికల్ ప్రజా రిపబ్లిక్ న్యూస్ ప్రతినిధి బత్తిని బాబు గౌడ్ తొ తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ తెలిపారు.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే పుష్పోత్సవం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం కానున్నాయి..

"బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ మహిళలు పాడే పాటలు, రంగురంగుల పూలతో పేర్చే బతుకమ్మలు పల్లెలు, పట్టణాల్లో పండుగ శోభను నింపే ఈ బతుకమ్మ పండుగ విశిష్టతను తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ వివరించారు.

బతుకునిచ్చే తల్లి బతుకమ్మ' అనే విశ్వాసంతో మహిళలు గౌరీదేవిని ఆరాధిస్తారు. సౌభాగ్యాన్ని, ఆయురారోగ్యాలను ప్రసాదించే అమ్మవారిని తమ ఇంటి ఆడబిడ్డగా భావించి ఆహ్వానించడం ఈ పండుగలోని ప్రత్యేకత. తంగేడు, గునుగు, గుమ్మడి, బంతి, చామంతి తదితర రంగురంగుల పుష్పాలతో బతుకమ్మను అందంగా పేర్చి, పైభాగంలో పసుపుతో చేసిన గౌరీదేవిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు.

ప్రకృతిలో లభించే పుష్పాలకు ప్రాధాన్యమివ్వడం ద్వారా పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ఈ పండుగ గుర్తుచేస్తుంది.

మహాలయ అమావాస్య రోజున ప్రారంభమయ్యే బతుకమ్మ వేడుకలు తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో కొనసాగుతాయి. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై, చివరి రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. ప్రతి రోజూ బతుకమ్మను ప్రత్యేకంగా పేర్చి, పూజలు నిర్వహించి, సంప్రదాయబద్ధమైన నైవేద్యాలను సమర్పిస్తారు.

తొమ్మిది రోజుల బతుకమ్మలకు సంప్రదాయంగా ప్రత్యేక పేర్లు ఉన్నాయి. ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ,



వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మగా వీటిని పిలుస్తారు. ప్రాంతీయ ఆచారాలను బట్టి కొన్ని పేర్లు, నైవేద్యాల్లో స్వల్ప మార్పులు కనిపిస్తాయి. బతుకమ్మ పండుగ ఆవిర్భావానికి సంబంధించి అనేక జానపద కథలు ప్రచారంలో ఉన్నాయి. వాటిలో ఒక కథ ప్రకారం, ఏడుగురు అన్నదమ్ములకు ఒకే ఒక్క చెల్లెలు ఉండేది. ఆమెను అన్నలు ఎంతో ప్రేమగా చూసుకునేవారు. అయితే, వారి భార్యలు ఆమెను ఇష్టపడక వేధించేవారని, ఒకరోజు ఇంటి నుంచి వెళ్లగొట్టారని ఆ గాథ వివరిస్తుంది. చెల్లెలు కనిపించకపోవడంతో అన్నలు ఆమె కోసం వెతుకుతుండగా, ఒక బావిలో తామరపువ్వు రూపంలో ఆమె కనిపించిందని, ఆ తర్వాత ఆ పువ్వు దైవత్వాన్ని సంతరించుకుందని కథనం. పూలతో ముడిపడిన ఈ గాథ బతుకమ్మ పండుగకు సంబంధించిన జానపద విశ్వాసాల్లో ఒకటిగా ప్రచారంలో ఉంది.

మరో కథనం ప్రకారం, చోళదేశపు రాజు ధర్మాంగదుడికి లక్ష్మీదేవి అనుగ్రహంతో కుమార్తె జన్మించిందని, ఆ బాలిక



అనేక కష్టాల నుంచి బయటపడటంతో ఆమెకు 'బతుకమ్మ' అని పేరు పెట్టారని చెబుతారు. మరో జానపద గాథలో అన్యాయాలకు గురైన గ్రామీణ మహిళను స్మరించుకుంటూ బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయని పేర్కొంటారు.

బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదు. కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను, గ్రామీణ సమాజాన్ని ఒకచోట చేర్చే సామూహిక వేడుక. ముఖ్యంగా పెళ్లైన ఆడపడుచులు పుట్టింటికి చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి సంబరాల్లో పాల్గొనడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అత్తింటి నుంచి పుట్టింటికి పంపే కానుకలు, వాయినాల సంప్రదాయం కుటుంబ సంబంధాల్లోని ఆప్యాయతను మరింత బలోపేతం చేస్తాయి.

తెలంగాణ మహిళల జీవనశైలి, జానపద కళలు, స్థానిక పుష్ప సంపద, ఆహార సంప్రదాయాలు, సామాజిక విలువలను ఒకే వేదికపై ప్రతిబింబించే బతుకమ్మ పండుగ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి,అస్తిత్వానికి

ప్రతీకగా నిలుస్తోంది. ప్రకృతిని ప్రేమించడం, మహిళలను గౌరవించడం, కుటుంబ బంధాలను పరిరక్షించడం వంటి విలువలను ఈ వేడుక చాటి చెబుతుందని చెరుకు మహేశ్వర శర్మ పేర్కొన్నారు. పల్లెపల్లెలో, వాడవాడలా జరిగే ఈ బతుకమ్మ సంబరాలు సరికొత్త ఉత్సాహాన్ని నింపాలని, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించాలని, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని మహేశ్వర శర్మ ఆకాంక్షించారు.

రాయికల్ విశ్వశాంతి పాఠశాల లో ముందస్తు దసరా, బతుకమ్మ వేడుకలు





రాయికల్ మండలం అక్టోబర్,09(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలైన ముందస్తు బతుకమ్మ మరియు దసరా పండుగలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థినీలందరూ ఎంతో చక్కగా బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూతెలంగాణలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలశీగణ వారంతా ఎంతో సంబరంగా జరుపుకునే గొప్ప పండుగలు ఇవి. వర్ష రుతువు ముగిసి, శరదృతువు ఆరంభంలో ప్రకృతి అంతా సరికొత్తగా ముస్తాబైన వేళ ఈ వేడుకలు మొదలవుతాయి.బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదు. ప్రకృతిని, ఆడబిడ్డలను గౌరవించే గొప్ప పండుగ. గునుగు, తంగేడు, తామర, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలను పీటలపై బతుకమ్మగా అమర్చి, గౌరమ్మను ప్రతిష్ఠించి పూజిస్తాం.బతుకమ్మ చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ, లయబద్ధంగా పాడే పాటలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. మహిళలంతా ఒక్కచోటికి చేరి సుఖసంతోషాల కోసం "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ పాటలు పాడటం ఎంతో అద్భుతంగా ఉంటుంది మరియుబతుకమ్మ పండుగ ముగిసిన మరుసటి రోజు నుంచే దసరా నవరాత్రులు ముగుస్తాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా మనం దసరా లేదా విజయదశమిని జరుపుకుంటాం.లోకకంటకుడైన మహిషాసురుడిని దుర్గామాత అంతమొందించిన పవిత్రమైన రోజు ఇది. అలాగే శ్రీరాముడు రావణాసురుడిని వధించిన రోజు కూడా ఇదే.దసరా రోజున ఆయుధ పూజ, వాహన పూజలు చేస్తారు. సాయంత్రం వేళ అందరూ జమ్మి చెట్టు (శమీ వృక్షం) వద్దకు వెళ్లి పూజలు చేసి, జమ్మి ఆకును "బంగారం"గా భావించి పెద్దల చేతుల్లో పెట్టి ఆశీర్వాదాలు తీసుకుంటారు.ఈ రెండు పండుగలు మనకు ఐక్యతను, సోదరభావాన్ని నేర్పుతాయి. పాత కోపాలు, ద్వేషాలను మరిచిపోయి అందరూ కలిసిమెలిసి ఆనందంగా గడపాలని,ఈ బతుకమ్మ, దసరా పండుగలు మీ అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని, మీ కుటుంబాల్లో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని తెలిపారు

బహుజన రాజ్యాధికారమే కాన్షీరాం ఆశయం!

ఆయన అడుగుజాడల్లో నడవడమే నిజమైన నివాళి!

మాన్యశ్రీ కాన్షీరాం ఆశయాలను కొనసాగించాలి ఏర్పుల రాజు, తెలంగాణ ఉద్యమకారుడు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9 (రిపబ్లిక్ న్యూస్)



బహుజనుల హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు, సామాజిక మార్పుకు నాంది పలికిన బహుజన ఉద్యమ వైతాళికుడు మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతి సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు ఏర్పుల రాజు ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పుల రాజు మాట్లాడుతూ.. కాన్షీరాం జీవితం, పోరాటం, ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

దేశంలో సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన బహుజన వర్గాలను ఏకం చేసి, వారికి రాజ్యాధికారంపై అవగాహన కల్పించేందుకు కాన్షీరాం చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాలు తమ హక్కులను తెలుసుకొని, విద్య, చైతన్యం, ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు."కాన్షీరాం గారికి నిజమైన నివాళి అంటే ఫొటోలకు పూలమాలలు వేయడం మాత్రమే కాదు.. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం. బహుజనులంతా ఐక్యంగా ఉండి, విద్యతో ఎదిగి, తమ హక్కుల కోసం ప్రశ్నించి, సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలి" అని ఏర్పుల రాజు సందేశమిచ్చారు.

సమాజంలో కుల, మత, ఆర్థిక అసమానతలు తొలగి ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించినప్పుడే మహనీయుల కలలు సాకారమవుతాయని తెలిపారు. యువత కాన్షీరాం జీవిత చరిత్రను అధ్యయనం చేసి, ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

విచ్ఛిన్నమైన బహుజనులను ఏకం చేసి రాజ్యాధికార దిశగా నడిపిన మహానేత కాన్షీరాం

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి

అక్టోబర్ 9 (రిపబ్లిక్ న్యూస్)




బహుజనులను ఏకం చేసి రాజ్యాధికార సాధన దిశగా నడిపించిన సామాజిక సంస్కర్త మాన్యశ్రీ కాన్షీరాం అని బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ్రాట్ గోవర్ధన్ అన్నారు. కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలు, మైనారిటీల హక్కుల సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కాన్షీరాం, 1971లో ఉద్యోగుల సంఘటిత ఉద్యమానికి పునాది వేసి, 1984 ఏప్రిల్ 14న బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో అణగారిన వర్గాల్లో రాజకీయ చైతన్యం కల్పించి, ఉత్తరప్రదేశ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారని పేర్కొన్నారు.

తన ఉద్యోగాన్ని వదిలి, వ్యక్తిగత జీవితాన్ని సైతం పక్కనపెట్టి బహుజనుల హక్కులు, రాజ్యాధికారం కోసం నిరంతరం కృషి చేసిన కాన్షీరాం ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని సామ్రాట్ గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడికి మనస్ఫూర్తిగా నివాళులర్పించారు.

ఆందోల్‌జోగిపేట అభివృద్ధికి భారీగా నిధులు

మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో పలు అభివృద్ధి పనులకు నిధులు



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9 (రిపబ్లిక్ న్యూస్)



జోగిపేట: రాష్ట్ర వైద్యారోగ్య, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో ఆందోల్‌జోగిపేట మున్సిపాలిటీకి భారీగా నిధులు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభివృద్ధి పనులకు మంజూరైన నిధుల వివరాలను వెల్లడించారు.జోగిపేట నెహ్రూ మెమోరియల్ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.22.73 కోట్లు, ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి రూ.10 కోట్లు, ఆర్డీవో కార్యాలయ నిర్మాణానికి రూ.5.75 కోట్లు, పర్యాటక అభివృద్ధికి రూ.6 కోట్లు, బహదూర్ ఖాన్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.3 కోట్లు, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి రూ.3.25 కోట్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.2 కోట్ల మంజూరైనట్లు వివరించారు.అలాగే బతుకమ్మ ఘాట్, అజ్జమర్రి వంతెన, సంగుపేట ఎక్స్‌రోడ్డు నుంచి అన్నాసాగర్ దర్గా వరకు డివైడర్లు, సెంటర్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మిగిలిన వార్డుల్లోనూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని నిధులు తీసుకొచ్చి ఆందోల్‌జోగిపేట మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాకూరి వెంకటేశం, మాజీ మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

స్థల వివాదంలో ఎమ్మెల్యే దగ్గుపాటి

ఫోన్ సంభాషణలతో ఆధారాలు బయటపెట్టిన మహిళ

డీఐజీకి మహిళ ఫిర్యాదు

రూ.70 లక్షలకు ఒప్పందం

రూ.10 లక్షలు అడ్వాన్స్ ఇచ్చానని ఆరోపణ

వేధింపులకు గురిచేస్తున్నారంటూ మహిళ ఆవేదన



అనంతపురం క్రైమ్,అక్టోబర్ 09,(రిపబ్లిక్ న్యూస్):
అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌పై కర్నూలుకు చెందిన దివ్యభారత్ అనే మహిళ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.స్థల విక్రయానికి సంబంధించి రూ.70 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని, అడ్వాన్స్‌గా రూ.10 లక్షలు చెల్లించినప్పటికీ మిగిలిన నగదు చెల్లించకుండా, స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తో మహిళ మాట్లాడిన ఫోన్ సంభాషణ వైరల్ గా మారింది.

ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదు
ఈ వ్యవహారంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆధారాలతో సహా రేంజ్ డీఐజీని కలిసి ఫిర్యాదు చేశారు.

రూ.70 లక్షలకు ఒప్పందం జరిగిందని అయితే
తాను స్థలం కొనుగోలు చేసేందుకు రూ.70 లక్షలకు ఒప్పందం చేసుకున్నానని, ముందస్తుగా రూ.10 లక్షలు చెల్లించానని దివ్యభారత్ పేర్కొన్నట్లు తెలిసింది. అయితే మిగిలిన నగదు చెల్లింపు, రిజిస్ట్రేషన్ విషయంలో వివాదం తలెత్తిందని ఆరోపించారు. ఈ క్రమంలో తనను మానసికంగా వేధిస్తున్నారని, స్థలంలోకి వెళ్లినప్పుడు కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

ఫోన్ సంభాషణతో వివాదం మరింత చర్చ
ఈ స్థల వ్యవహారానికి సంబంధించి జరిగినట్లు చెబుతున్న ఫోన్ సంభాషణలో నగదు చెల్లింపు, స్థలం ఎవరి పేరుపై ఉందనే అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. రూ.70 లక్షలు చెల్లిస్తానని చెప్పిన విషయాన్ని మహిళ ప్రస్తావించగా, స్థలం రిజిస్ట్రేషన్, ఇతర వ్యక్తుల ప్రమేయంపై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు సంభాషణ ద్వారా తెలుస్తోంది.
గతంలోనూ పోలీసులను ఆశ్రయించినప్పటికీ స్పందన లభించలేదని మహిళ ఆరోపించారు. ఈ నేపథ్యంలో రేంజ్ డీఐజీని కలిసి ఫిర్యాదు చేయడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్ విచారణకు ఆదేశించారు. విచారణ నివేదిక ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆరోపణలను ఖండించిన ఎమ్మెల్యే



మరోవైపు, ఈ స్థల వివాదంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఖండించారు. ఫిర్యాదు చేసిన మహిళ ఎవరో కూడా తనకు తెలియదని పేర్కొన్నారు. దీంతో మహిళ చేసిన ఆరోపణలు, ఎమ్మెల్యే ఇచ్చిన వివరణ నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఉత్కంఠ నెలకొంది. పోలీసుల విచారణలో స్థల ఒప్పందం, నగదు చెల్లింపులు, రిజిస్ట్రేషన్ అంశాల్లో ఎలాంటి విషయాలు వెలుగులోకి వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం




కొత్తచెరువు సంక్షేమం, అక్టోబర్ 09,(రిపబ్లిక్ న్యూస్):



మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖలో భాగమైన జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తచెరువులోని బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తచెరువు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు మొబైల్ ఫోన్ల వినియోగాన్ని పరిమితం చేసి, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దానిని సాధించే దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని తెలిపారు.జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్ మాట్లాడుతూ నేటి బాలికలు విద్య, ఉద్యోగాలు, పరిపాలనతో పాటు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేయకుండా, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవడానికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని బాలికలకు పిలుపునిచ్చారు.అనంతరం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల నుంచి కొత్తచెరువు కూడలి వరకు విద్యార్థినులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలికల హక్కులు, విద్య ప్రాముఖ్యత, సమాన అవకాశాలు, బాలికల సాధికారతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. కూడలిలో మానవహారం నిర్వహించి, బాలికల అభ్యున్నతికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ నాగసుధ, కమిటీ సభ్యులు వీరనారాయణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, పి ఆర్ డి ఎస్ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, చిల్డ్రన్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ప్రొటెక్షన్ ఆఫీసర్లు నాగలక్ష్మి, మురళీధర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ లోకంలో విషాదం.. ముదిగొండ ఇకలేరు

అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.



ప్రముఖ చారిత్రక నవలా రచయిత, 'చారిత్రక నవలా చక్రవర్తి'గా ఖ్యాతి గడించిన ముదిగొండ శివప్రసాద్ (86) కన్నుమూశారు. గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు గురువారం రాత్రి గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8:45 గంటల సమయంలో మరోసారి గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు.1940 డిసెంబర్ 23న ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో జన్మించిన శివప్రసాద్, హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. తన సుదీర్ఘ సాహిత్య ప్రస్థానంలో ఆయన 80కి పైగా గ్రంథాలను రచించగా, వాటిలో 20కి పైగా చారిత్రక నవలలు ఉన్నాయి. కాకతీయ కళాదర్శనం, తంజావూరు విజయం, రెసిడెన్సీ, శ్రీలేఖ, ఆవాహన వంటి రచనలు తెలుగు సాహిత్యంలో విశేష ఆదరణ పొందాయి. భారత చరిత్రను, సంస్కృతిని తన రచనల ద్వారా సామాన్య పాఠకులకు చేరువ చేయడంలో ఆయన విశేష కృషి చేశారు.ఆయనకు కుమారుడు ఇందుశేఖర్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య కొన్నేళ్ల క్రితమే మరణించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు శివం రోడ్డులోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో గల ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమై, అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ముదిగొండ శివప్రసాద్ మరణం తెలుగు చారిత్రక సాహిత్య రంగానికి తీరని లోటని పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

దసరా పండుగ సందడి.. కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్

అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.
దసరా పండుగ సెలవులు ప్రారంభం కావడంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలో పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో, శుక్రవారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. నగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. కుటుంబ సభ్యులు, విద్యార్థులతో బస్టాండ్ల ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి.పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ 18వ తేదీ వరకు మొత్తం 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్ నుంచి 3,533 బస్సులు నడుస్తుండగా, హైదరాబాద్ జోన్ నుంచి 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 బస్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీ నగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి.అయితే, ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఛార్జీలను 1.5 రెట్లు (50 శాతం అదనంగా) పెంచినట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే అక్టోబర్ 9, 10, 16, 17 తేదీలతో పాటు, తిరుగు ప్రయాణ రద్దీ ఉండే అక్టోబర్ 25, 26 తేదీల్లో ఈ పెంచిన ఛార్జీలు వర్తిస్తాయి. సాధారణ బస్సు సర్వీసుల్లో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్టాండ్లలో తాత్కాలిక షెల్టర్లు, తాగునీటి సౌకర్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, మొబైల్ టాయిలెట్లను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. సెలవుల అనంతరం తిరుగు ప్రయాణ రద్దీని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడుపుతామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం

రూ.5 కోట్లతో 7,300 సైకిళ్ల పంపిణీ -కుందుర్పిలో ఒకేరోజు 600 మందికి అందజేత

2028 నాటికి బీటీపీ పూర్తి చేసి సాగునీరు అందిస్తాం -ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు





కళ్యాణదుర్గం /కుందుర్పి, అక్టోబర్ 09,(రిపబ్లిక్ న్యూస్):
విద్యార్థుల చదువుకు దూరం అడ్డంకి కాకూడదు.. ఆర్థిక ఇబ్బందులతో విద్యాభ్యాసం కుంటుపడకూడదనే లక్ష్యంతో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో "అమిలినేని విద్యాచక్రం" కార్యక్రమం ద్వారా సుమారు రూ.5 కోట్లతో 7,300 సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఇందులో భాగంగా కుందుర్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఒకేరోజు 600 మంది విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. 9, 10వ తరగతులతోపాటు ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి, వారి చదువుకు తోడ్పాటునందించేందుకు సైకిళ్లను అందిస్తున్నట్లు వెల్లడించారు.

తల్లికి వందనం..చదువుకుంటున్న పిల్లలకు ఆర్థిక సహాయం
ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. గతంలో అమ్మవడి పథకం ద్వారా పరిమితంగా లబ్ధి చేకూర్చారని ఆరోపిస్తూ, ప్రస్తుతం తల్లికి వందనం పథకం ద్వారా చదువుకుంటున్న పిల్లలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ఎస్సార్సీ సంస్థ సహకారం కీలకమని అమిలినేని తెలిపారు. సంస్థలో పనిచేస్తున్న సుమారు 7,000 మంది సిబ్బంది కృషి, సంస్థ ప్రతినిధుల తోడ్పాటుతోనే రూ.5 కోట్ల విలువైన సైకిళ్ల పంపిణీ సాధ్యమైందన్నారు.

బీటీపీ పూర్తయితే రైతులకు సాగునీటి పరంగా ప్రయోజనం
రాజగోపాల్, వెంకటేష్, మహీధర్‌రెడ్డి, యశ్వంత్, నవీన్, ధర్మతేజ, అవినాష్‌తోపాటు సీఎఫ్ఓ షీమా సహకారాన్ని ప్రస్తావించారు. తమ కుటుంబం ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తోందని, తనకు చేతనైనంత సాయం చేయాలనే ఉద్దేశంతోనే నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని చెప్పారు.కళ్యాణదుర్గం ప్రాంత రైతులకు సాగునీరు అందించే బీటీపీ ప్రాజెక్టును 2028 మార్చి నాటికి పూర్తి చేసి నీటిని అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ప్రాజెక్టు పనులు ఆలస్యమ య్యాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీటీపీ పూర్తయితే ఈ ప్రాంత రైతులకు సాగునీటి పరంగా ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంతోపాటు కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని, కూటమి ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై పోలింగ్ సిబ్బందికి ముందస్తు సూచనలు.

తహసీల్దార్ సిద్ధేశ్వర రావు.

రైల్వే కోడూరు అక్టోబర్ 9 రిపబ్లిక్ న్యూస్.
ఓబులవారిపల్లి మండలంలో రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలైన ఎం. పి. టి. సి., జడ్. పి. టి. సి., సర్పంచ్ ఎన్నికల పై అందరు ప్రత్యేక దృష్టిపెట్టి జాగ్రత్త లు పాటించాలని తహసీల్దార్ సిద్ధేశ్వర రావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎం. పి. డీ. ఓ. సభభవనంలో ఎం. పి. డీ. ఓ. రాజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల దిశ నిర్దేశ సమావేశానికి తహసీల్దార్ ముఖ్య అతిది గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రాబోయే ఎన్నికలు చాలా సమస్యత్మ కంగా ఉంటాయని వీటిపట్ల అన్నివిధాలా జాగ్రత్త లు వహించాలి అన్నారు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు వారి వారి పరిధిలో ఉన్న బూతులు గురించి తెలుసు కొని వాటి పట్ల అత్యంత, జాగ్రత్త లు పాటించాలి అన్నారు. అనంతరం ఎస్. ఐ. సుజనా కుమార్ మాట్లాడు తూ సమస్యాత్మక గ్రామాలు, సమస్యత్మక బూతులు, వ్యక్తులు పై ముందే అరా తీసి



జాబితా తయారు చేశామన్నారు. కార్యదర్శులు ఎక్కడ అయిన ఎలాంటి అవాంచనీయ సంఘటన్లు జరిగే అవకాశమున్న సంబంధిత అధికారులకు వెంటనే తెలియ జేయాలాన్నారు. ఎం. పి. డీ. ఓ. ఎం వి ఎన్ రాజేంద్ర మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దిశ నిర్దేశల గురించి తెలియ జేశారు, ఎన్నికల పోలింగ్ సిబ్బంది ఎల్లవేళలా ఫోన్ అందుబాటులో ఉండాలని స్విచ్ ఆఫ్ చేయడం నెట్వర్క్ లేదనడం రీఛార్జ్ లేదని అలాంటి సంఘటనలు పునరాగం కాకుండా ఎల్లప్పుడు ఫోన్లు అందుబాటులో ఉండాలని అధికారులతో సంప్రదింపులు ఉండాలని ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు ఉంటాయని పోలింగ్ సిబ్బందికి తెలియజేశారు



పోలింగ్ బూత్ లో వాటర్ బాటిల్ లో లేకుండా చూసుకోవాలి పరిసరాలు అన్ని సక్రమంగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వారికి సూచించారు, ఎలాంటి సమస్యలు ఎదురైనా సంఘటనలు ఎదురైనా తాసిల్దార్ సిద్ధేశ్వర రావు గారి సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్కు గాని నాకు గాని అందుబాటులో ఉండాలని తెలిపారు,ఈ కార్యక్రమం మండల రెవెన్యూ అధికారి మల్లికార్జునెడ్డి, డిప్యూటీ ఎండిఓ రామ్మోహన్ రెడ్డి, స్వర్ణ గ్రామం డిప్యూటీ ఎండిఓ కృష్ణ, పి ఆర్ ఏ ఈ ఆంజనేయ ప్రసాద్,ఏవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.